ప్రగతి పథాన..


పత్తికొండ శివారులో హంద్రీనీవా ప్రధాన కాలువ ఆదోని రోడ్డు మలుపు వద్ద సీసీ లైనింగ్‌కు సన్నాహాలు


అసంపూర్తిగా ఆర్డీఎస్ కుడి కాలువ హెడ్ స్లూయిస్

- హంద్రీనీవా విస్తరణ పరుగులు
- ఓర్వకల్లుకు పారిశ్రామిక వైభవం
- కూటమి ప్రభుత్వం రాకతో బాగుపడిన రహదారులు
- కందనవోలు అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలి
- టిడ్కో ఇళ్లు పేదలకు ఇవ్వాలి
- కర్నూలు స్మార్ట్‌సిటీ అభివృద్ధి కోసం నిధులు ఇవ్వాలి
- పాణ్యం నియోజకవర్గంలో 'ప్రజావేదిక'
- నేడు జిల్లాకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

కర్నూలు, మే 16 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు సారధ్యంలో టీడీపీ కూటమి ప్రభుత్వం కొలువుదీరి 11 నెలలు పూర్తయింది. జూన్ 11న ఏడాది సంబరాలు జరుపుకోవడానికి కూటమి పార్టీల కార్యకర్తలు, నాయకులు సన్నద్ధం అవుతున్నారు. కూటమి ప్రభుత్వం రాగానే ప్రగతి వైపు అడుగులు పడ్డాయి. వైసీసీ హయాంలో నిర్లక్ష్యంగా వదిలేసిన గుంతల దారులు బాగుపడ్డాయి. ఓర్వకల్లు కేంద్రంగా పారిశ్రామిక ప్రగతికి బీజం వేశారు. హైకోర్టు బెంచ్ ఏర్పాటు దిశగా అడుగులు పడ్డాయి. కరువు సీమ జీవనాడి హంద్రీనీవా కాల్వ విస్తరణ పనులు పరుగులు పెడుతున్నాయి. ఇప్పుడిప్పుడే అభివృద్ధి పనులు ఊపందుకుంటున్నాయి. జూన్‌లో ప్రారంభమయ్యే విద్యా సంవత్సరం ఆరంభంలోనే తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ డబ్బులు తల్లులు, రైతుల ఖాతాలో జమ చేస్తామని ఇప్పటికే స్పష్టత ఇచ్చారు. ఇంతవరకు బాగానే ఉన్నా కరువు, వలసలతో నిత్యం తల్లడిల్లే కందనవోలు పశ్చిమ ప్రాంతం పల్లెసీమల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలి. వేదవతి, ఆర్డీఎస్ కుడి కాలువ, గుండ్రేవుల ప్రాజెక్టులు చేపట్టాలి. నిరుపయోగంగా ఉన్న ఏపీ టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు అప్పగించాలని కోరుతున్నారు. కూటమి పార్టీల్లో కుమ్ములాటపై దృష్టి సారించాలి. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకుల మధ్య సమన్వయం చేయకపోతే రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉంది. దీనిపై అధినేత ఫోకస్ పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ప్రజావేదిక, మార్గదర్శి-బంగారు కుటుంబం (పీ-4) కార్యక్రమంలో భాగంగా నేడు ముఖ్యమంత్రి చంద్రబాబు జిల్లాకు వస్తున్న సందర్భంగా చేపట్టిన ప్రగతి, చేయాల్సిన అభివృద్ధిపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.

ప్రగతి పరుగులు

- ఓర్వకల్లు ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీ 2,612 ఎకరాల్లో రూ.2,786 కోట్లతో అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ (ఎన్‌ఐసీడీపీ)లో భాగంగా ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీల అభివృద్ధికి ఫేజ్-1 కింద 2,612 ఎకరాల్లో ఓర్వకల్లు ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీలో రూ.2,786 కోట్లతో మౌలిక వసతులు కల్పించనున్నారు. వివిధ పరిశ్రమలు ఏర్పాటు ద్వారా రూ.12 వేల కోట్లు పెట్టుబడులు, 45,071 మంది యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నారు.
- జపాన్‌కు చెందిన ఇటోయె మైక్రో టెక్నాలజీ కార్పొరేషన్, ఇండియాకు చెందిన హైడ్రెన్ గ్రూప్, బీఎస్ గ్రూపులు సంయుక్తంగా దాదాపు రూ.14వేల కోట్ల పెట్టుబడులతో సెమీ కండక్టర్ తయారీ పరిశ్రమను 130 ఎకరాల్లో స్థాపించేందుకు ఒప్పందం చేసుకున్నారు. 1200 ఎకరాల్లో రూ.13వేల కోట్లతో 'ఈవీ పార్క్' ఏర్పాటుకు ఒప్పందం కుదిరింది. 300 ఎకరాల్లో రూ.వెయ్యి కోట్లతో డ్రోన్ హబ్‌ను ఏర్పాటు చేయబోతున్నారు.
- ఉమ్మడి జిల్లాలో రూ.690 కోట్లతో హంద్రీనీవా విస్తరణ చేపట్టారు. జూలై 10 తరువాత 3,860 క్యూసెక్కులు కృష్ణా జలాలు తీసుకోవాలని లక్ష్యం. కరువు రైతులకు పెద్ద ఊరట ఇది.
- గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ అమల్లో భాగంగా కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు కసరత్తు దాదాపు పూర్తయింది. లీగల్ అండ్ లెజిస్లేటివ్ అఫైర్స్ అండ్ జస్టిస్, లా డిపార్ట్‌మెంట్ ప్రభుత్వ కార్యదర్శి వి.సునీ అక్టోబరు 28న నంబరు. 2589691/ఎస్‌సీ.ఎఫ్/ఏ2/2024 కింద హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్‌కు లేఖ రాశారు.

మిగతా 7వ పేజీలో..

పేదరికం లేని సమాజమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోంది. పీ-4 కార్యక్రమంలో భాగంగా 'మార్గదర్శి-బంగారు కుటుంబం' కార్యక్రమానికి సీఎం చంద్రబాబు ఉగాది పర్వదినాన శ్రీకారం చుట్టారు. ప్రతి నెల మూడో శనివారం ఒక జిల్లాలో ఈకార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా నేడు సీఎం చంద్రబాబు జిల్లాకు రానున్నారు. పాణ్యం నియోజకవర్గం పరిధిలోని కల్లూరు అర్బన్‌లో జరిగే ఈ కార్యక్రమానికి సన్నాహాలు చేస్తున్నారు. ఎమ్మెల్యే గౌరు చరిత అధ్వర్యంలో అత్యంత పేదరికంలో మగ్గుతున్న రెండు కుటుంబాలను ఎంపిక చేసి దత్తత తీసుకుంటారు. పేదరికం నుంచి ఆ కుటుంబాలను పైకి తీసుకువచ్చేందుకు ప్రభుత్వం, ప్రైవేటు సంస్థలు చేయూత అందిస్తాయి. నంద్యాల చెక్‌పోస్టు సమీపంలో కేంద్రీయ విద్యాలయం పక్కనే భారీ బహిరంగ సభ ఏర్పాటు చేయనున్నారు. ఎమ్మెల్యే గౌరు చరిత, జిల్లా కలెక్టరు రంజిత్ బాషా ప్రతిష్టాత్మకంగా తీసుకొని 'మార్గదర్శి-బంగారు కుటుంబం' కార్యక్రమం విజయవంతం చేసేందుకు ఏర్పాట్లు చేశారు.

ఇంటర్ పరీక్షల్లో 448 మంది గైర్హాజర్

కర్నూలు ఎడ్యుకేషన్, మే 16 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షల్లో శుక్రవారం 448 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఉదయం జరిగిన ప్రథమ సంవత్సరం పరీక్షల్లో 7061 మంది విద్యార్థులకుగానూ 6774 మంది హాజరుకాగా 347 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన ద్వితీయ సంవత్సరం పరీక్షకు 1599 మంది నమోదు చేసుకున్నారు. ఇందులో 1498 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా, 101 మంది గైర్హాజరయ్యారు. మొత్తం ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 448 మంది గైర్హాజరైనట్లు ఆర్ఐవో గురువయ్య శెట్టి తెలిపారు. ఎలాంటి మాల్ ప్రాక్టీసు కేసు నమోదు కాలేదు. పరీక్షా కేంద్రాలను కన్వీనర్, ఆర్ఐవో ఎస్‌వీఎస్ గురువయ్య శెట్టి, డీవీఈవో సురేష్ బాబు, జిల్లా డీఈసీ సభ్యులు, ఫ్లయింగ్, సిట్టింగ్ స్క్వాడ్ సభ్యులు పర్యవేక్షించారు.

సీఎం పర్యటనకు పటిష్ట భద్రత

- 1,700 మంది పోలీసులతో బందోబస్తు
- ఎస్పీ విక్రాంత్ పాటిల్


సీఎం పర్యటన స్థలం వద్ద పోలీసులు

కర్నూలు క్రైం, మే 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కర్నూలు నగరం పర్యటన సందర్భంగా పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. ఓర్వకల్లు ఎయిర్‌పోర్టు నుంచి ప్రజావేదిక సభ జరిగే నంద్యాల చెక్‌పోస్టు వరకు, నంద్యాల చెక్‌పోస్టు నుంచి సీ.క్యాంపు వరకు, నంద్యాల చెక్‌పోస్టు సమీపంలోని పార్కు వరకు సీఎం పర్యటన సందర్భంగా కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్, క్లూజ్‌టీం శుక్రవారం పర్యటించాయి.

మిగతా 6వ పేజీలో

పొరపాట్లు జరిగితే మీదే బాధ్యత

- అర్జీలు స్వీకరించేందుకు కౌంటర్ ఏర్పాటు
- స్టేజీ, స్టాల్స్, పార్కింగ్ ఏర్పాట్లపై సూచనలు
- కలెక్టర్ పి.రంజిత్ బాషా
- ప్రోగ్రాం కోర్డినేటర్, ఎస్పీతో కలిసి పనుల పరిశీలన


ఏర్పాట్లు పరిశీలిస్తున్న పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, కలెక్టర్ రంజిత్ బాషా , ఎస్పీ విక్రాంత్ పాటిల్

కర్నూలు అగ్రికల్చర్, మే 16 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు నాయుడు సి.క్యాంపు రైతుబజారు పర్యటనలో చిన్న పొరపాటు జరిగినా మార్కెటింగ్ శాఖ యంత్రాంగానిదే బాధ్యత అని కలెక్టర్ రంజిత్‌బాషా స్పష్టం చేశారు. శుక్రవారం కలెక్టర్ సి.క్యాంపు రైతుబజారుతో పాటు ప్రజావేదిక వద్ద జరుగుతున్న పనులను ఏపీ సీఎం ప్రోగ్రాం కోఆర్డినేటర్ వెంకటేశ్, ఎస్పీ విక్రాంత్ పాటిల్‌తో కలిసి పరిశీలించారు. సి.క్యాంపు రైతుబజారు, ప్రజా వేదిక, స్వచ్ఛాంధ్ర పార్కు ఏర్పాటుకు భూమిపూజ కార్యక్రమాలకు సంబంధించి జరుగుతున్న పనులపై వారు సంతృప్తి వ్యక్తంచేశారు. ప్రజాసమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమానికి సంబంధించి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించేందుకు కౌంటర్ ఏర్పాటుచేయడంతో పాటు బ్యానర్ ఏర్పాటుచేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని డీఆర్‌డీఏ డ్వామా పీడీలను ఆదేశించారు. స్టేజీ, స్టాల్స్ కాన్వాయ్, వీఐపీ పార్కింగ్ ఏర్పాట్లను కలెక్టర్ స్వయంగా పరిశీలించి ఇంకా చేపట్టాల్సిన పనులపై అధికారులకు సూచనలు చేశారు. పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, ఎస్పీ విక్రాంత్ పాటిల్, జేసీ డా.బి.నవ్య, మార్కెటింగ్ శాఖ కమిషనర్ విజయ సునీత, కర్నూలు ఆర్డీవో సందీప్‌కుమార్, టీటీడీ బోర్డు సభ్యులు మల్లెల రాజశేఖర్, మున్సిపల్ కమిషనర్ రవీంద్ర బాబు, కడప జేడీ రామాంజనేయులు ఉన్నారు.

రేషన్‌కార్డులకు దరఖాస్తుల వెల్లువ

కర్నూలు కలెక్టరేట్, మే 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం కొత్త రేషన్‌కార్డులకు అనుమతి ఇవ్వడంతో అర్హులైన వారందరూ రేషన్‌కార్డులకు దరఖాస్తు చేసుకుంటున్నారు. రేషన్ కార్డులో కొత్తవారు చేరిక, చిరునామాలో మార్పులు, చేర్పులు తదితర సవరణల కోసం శుక్రవారం నాటికి 13,922 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో 17 మంది రేషన్ కార్డుదారులు తమ రేషన్ కార్డులను తొలగించాలని దరఖాస్తు చేసుకున్నారు. ఆదోని డివిజన్‌లోని రేషన్ కార్డులోకి కొత్తవారు చేరిక కోసం 5,429 మంది, కొత్త రేషన్‌కార్డు కోసం 237 మందితో పాటు అడ్రస్ మార్పులు, చేర్పులు తదితర సవరణల కోసం మొత్తం 481 మంది దరఖాస్తు చేసుకున్నారు. కర్నూలు డివిజన్‌లోని రేషన్‌కార్డులోకి కొత్తవారి చేరిక కోసం 3,516 మంది, కొత్త రేషన్‌కార్డుల కోసం 277మందితో పాటు అడ్రస్ మార్పులు, చేర్పులు తదితర సవరణల కోసం మొత్తం 458 మంది దరఖాస్తులు చేసుకున్నారు. పత్తికొండ డివిజన్‌లోని రేషన్‌కార్డులోకి కొత్తవారు చేరిక కోసం 2,959 మంది, కొత్త రేషన్‌కార్డు కోసం 232 మందితో పాటు అడ్రస్ మార్పులు, చేర్పులు సవరణల కోసం 333మంది దరఖాస్తు చేసుకున్నారు.

21న డీఈవో కార్యాలయాల ముట్టడి

నంద్యాల ఎడ్యుకేషన్, మే 16 (ఆంధ్రజ్యోతి): విద్యాశాఖ విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల 21న ఉమ్మడి నంద్యాల, కర్నూలు జిల్లాల డీఈవో కార్యాలయాల ముట్టడి కార్యక్రమం చేస్తున్నట్లు ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక శుక్రవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చింది. వైసీపీ ప్రభుత్వం ఆరురకాల పాఠశాలలను ప్రవేశపెడితే ప్రస్తుత కూటమి ప్రభుత్వం తొమ్మిది రకాల పాఠశాలలను ప్రతిపాదించి అమలుచేసేందుకు పూనుకోవడం ప్రభుత్వ పాఠశాల వ్యవస్థను నిర్వీర్యం చేయడమేనని పేర్కొన్నారు.

పాక్ దాడులకు భారత్ బెదరదు

- రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్
- 'ఆపరేషన్ సిందూర్' విజయంపై హర్షం
- కర్నూలు నగరంలో భారీగా తిరంగ ర్యాలీ
- ప్రారంభించిన మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్

కర్నూలు ఎడ్యుకేషన్, మే 16 (ఆంధ్రజ్యోతి): పాకిస్తాన్ దాడులకు బెదిరేదీ లేదని, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 140 కోట్ల ప్రజలకు సూచించారని రాష్ట్ర పరిశ్రమల శాఖా మంత్రి టీజీ భరత్ పేర్కొన్నారు. శుక్రవారం కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో 'ఆపరేషన్ సిందూర్' విజయానికి సంఘీభావం తెలుపుతూ కర్నూలు నగరంలో భారీ తిరంగ ర్యాలీ నిర్వహించారు. జిల్లా పరిషత్ వద్ద ఈర్యాలీని మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా టీజీ భరత్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ప్రాణనష్టం లేకుండా పాకిస్థాన్‌పై దాడిని విజయవంతం చేయడం యావత్ భారత దేశం గర్వపడుతుందన్నారు. 'ఆపరేషన్ సిందూర్' విజయంపై ప్రధాని నరేంద్ర మోదీకి ధన్యవాదాలు తెలిపారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి మాట్లాడుతూ భారత దేశ సైనికులకు మద్దతుగా కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో ఘనంగా తిరంగ ర్యాలీ నిర్వహించడం హర్షణీయమన్నారు. ఆదోని ఎమ్మెల్యే వాల్మీకి పార్థసారధి మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ తీసుకున్న నిర్ణయానికి మద్దతుగా తిరంగ ర్యాలీ నిర్వహిస్తున్నామని తెలిపారు. జనసేన పాణ్యం నియోజకవర్గ ఇన్‌చార్జి చింతా సురేష్‌కుమార్ మాట్లాడుతూ వీరజవాన్లకు 140కోట్ల మంది ప్రజల మద్దతు ఉందన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రి కేఈ ప్రభాకర్, కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ, కే.చెన్నయ్య, మధు మోహన ఆచారి, సుధాకర్, రామస్వామి, రామకృష్ణ, డీసీసీబీ చైర్మన్ వై.నాగేశ్వరరావు యాదవ్, టీడీపీ నాయకులు కేవీ సుబ్బారెడ్డి, జనసేన నాయకులు పీబీవీ సుబ్బయ్య, 17వ వార్డు కార్పొరేటర్ పద్మలతారెడ్డి, టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





ర్యాలీని ప్రారంభిస్తున్న టీజీ భరత్, టీజీ వెంకటేశ్ తదితరులు



నగరంలోని రాజ్‌విహార్ నుంచి ర్యాలీ నిర్వహిస్తున్న ప్రజలు విద్యార్థులు



సీఎం పర్యటనకు పటిష్ట భద్రత

(5వ పేజీ తరువాయి)

ఓర్వకల్లు నుంచి సీ.క్యాంపు రైతుబజారు వరకు ఉన్న మార్గాల్లో పలు క్రాస్ రోడ్లు ఉండటంతో పాటు కర్నూలు నగరంలో చెక్‌పోస్టు నుంచి సీ.క్యాంపు వరకు తీవ్ర రద్దీ ఉన్న నేపథ్యంలో కర్నూలు, నంద్యాల జిల్లాలోని పోలీసులను ఈ బందోబస్తుకు నియమించారు. నంద్యాల చెక్‌పోస్టు సమీపంలోని కేంద్రీయ విద్యాలయం ఎదురుగా ఉన్న మెగా సిరి ఫంక్షన్ హాలులో పోలీసులకు జిల్లా ఎస్పీ విక్రాంత్‌పాటిల్ పలు సూచనలు, సలహాలు దిశానిర్దేశం చేశారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటించే రూట్ అండ్ రూఫ్ - టాప్ ప్రాంతాల్లో, సీఎం కాన్వాయ్, సభప్రాంగణం తదితర ప్రాంతాల్లో బందోబస్తు విధులు నిర్వహించే మఫ్టీ పోలీసులు, స్పెషల్ పార్టీ పోలీసు బృందాలు, పోలీసు జాగీలాలు, బాంబ్ స్క్వాడ్ బృందాలతో పోలీసు అధికారులు, పోలీసులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ముఖ్యమంత్రి పర్యటనకు 1700 మంది పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. ఇందులో నలుగురు ఏఎస్పీలు, 11 మంది డీఎస్పీలు, 53 మంది సీఐలు, 101 మంది ఎస్ఐలు, 383 మంది ఏఎస్ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, 680 మంది కానిస్టేబుళ్లు, 51 మంది మహిళా పోలీసులు, 416 మంది హోంగార్డులు, 5 సెక్షన్ల ఏఆర్ సిబ్బంది, 6 స్పెషల్ పార్టీ బృందాలను బందోబస్తు విధులకు కేటాయించామన్నారు. ఈ పరిశీలనలో ఏఎస్పీ (అడ్మిన్) హుస్సేన్‌పీరా, ఏఆర్ ఏఎస్పీ కృష్ణమోహన్ కర్నూలు రేంజ్ పరిధిలోని ఏఎస్పీలు, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది ఉన్నారు.

ఓర్వకల్లు ఎయిర్‌పోర్టు నుంచి సీ.క్యాంపు రైతుబజారు వరకు ఏర్పాట్లన్నీ చకచకా పూర్తయ్యాయి. ఆగమేఘాల మీద యుద్ధ ప్రాతిపదికన ఏర్పాట్లు సిద్ధం చేశారు. జాతీయ రహదారిపై ఉన్న గుంతలన్నీ వెంట వెంటనే తారుతో పూడ్చివేశారు. ఈ మార్గంలో ఉన్న స్పీడ్ బ్రేకర్లన్నీ తొలిగించారు. డివైడర్లకు రంగులు వేసి ముస్తాబు చేశారు. రైతుబజారు సమీపంలో ఉన్న చెత్తను తొలిగించేశారు. రోడ్డుకిరువైపులా గ్రావెల్ వేసి చదును చేశారు. పూర్తిగా దెబ్బతిన్న చోట బీటీ రోడ్డు వేశారు.

వాహనాల రాకపోకలు మళ్లింపు

ముఖ్యమంత్రి చంద్రబాబు కర్నూలులో స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమానికి వస్తున్న సందర్భంగా పోలీసులు శనివారం ఉదయం 5 నుంచి సాయంత్రం 6 గంటల వరకు వాహనాల రాకపోకలపై పలు ఆంక్షలు విధించారు. వివిధ ప్రాంతాల నుంచే వచ్చే వాహనాల రాకపోకలను మళ్లించారు.

- ఆత్మకూరు, నందికొట్కూరు నుంచి వచ్చే వాహనాలు గార్గేయపురం ఎన్‌హెచ్ 350సీ మీదుగా సఫా కాలేజీ రింగ్ రోడ్డు, గుత్తి పెట్రోల్ బంకు, బళ్లారి చౌరస్తా మీదుగా ఆర్టీసీ బస్టాండుకు వెళ్లాలి.
- నంద్యాల, ఆత్మకూరు, నందికొట్కూరు, డోన్ వైపు వెళ్లే వాహనాలు ఆర్టీసీ బస్టాండు నుంచి బళ్లారి చౌరస్తా, గుత్తి పెట్రోల్ బంకు, రింగ్ రోడ్డు సఫా కాలేజీ మీదుగా ఎన్‌హెచ్-40, ఎన్‌హెచ్-350 సీ హైవేల నుంచి వెళ్లాలి.
- డోన్, అనంతపురం వైపు నుంచి వచ్చే వాహనాలు గుత్తి పెట్రోల్ బంకు చెన్నమ్మ సర్కిల్, బళ్లారి చౌరస్తా మీదుగా ఆర్టీసీ బస్టాండుకు వెళ్లాలి. ప్రజలు ట్రాఫిక్ మళ్లింపును గమనించి సహకరించాలని తెలిపారు.

సీఎం వస్తేకానీ పట్టించుకోరా?

- ఏళ్లుగా పరిష్కారం కాని సమస్యలు
- ఒక్క రోజులో రోడ్లు, డ్రైనేజీలు, రంగులు
- అధికారుల తీరుపై ప్రజల్లో అసహనం


రోడ్డు వేస్తున్న దృశ్యం

కర్నూలు క్రైం, మే 16 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు వస్తున్నారని అధికారులు అత్యుత్సాహంతో చేసిన అభివృద్ధి పనులపై ప్రజలు పెదవి విరుస్తున్నారు. ఎన్నో ఏళ్ల నుంచి కాలనీలకు రోడ్లు సదుపాయం లేక ఇబ్బందులు పడుతుంటే అధికారులు ఆవైపు కూడా వెళ్లి చూడలేదు. కానీ సీఎం వస్తున్నారని ఆగమేఘాలపై రోడ్లు వేయడం, కాలువలు శుభ్రం చేయడం, తదితర అభివృద్ధి పనులు చేయడంపై ప్రజలు భిన్నంగా స్పందించారు. సీఎం చంద్రబాబు వస్తే కానీ వాళ్లకు సమస్యలు పట్టవా? అంటూ అధికారులపై విమర్శలు గుప్పిస్తున్నారు. గత మూడు నెలలుగా నంద్యాల చెక్‌పోస్టులో చలువ పందిళ్లు వేయని అధికారులు ఒక్కరోజులో సీఎం వస్తున్నారని చలువ పందిళ్లు వేయడం, అది కూడా ఎండలు తగ్గుముఖం పట్టిన తర్వాత ఏర్పాటు చేయడం హాస్యాస్పదంగా ఉందంటూ ప్రజలు చర్చించుకున్నారు.

మరో వైపు చెక్‌పోస్టు నుంచి పుల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాల వరకు ఉన్న రోడ్డు మొత్తం పూర్తిగా దెబ్బతింది. ఈ మార్గంలో వాహనదారులు నెలల తరబడి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కానీ సీఎం వస్తున్నారనీ ఆఘమేఘాల మీద కొత్త బీటీ రోడ్డు వేశారు. అధికారులు తలుచుకుంటే రెండు రోజుల్లోనే అన్ని సమస్యలు తీర్చవచ్చని, అలాంటిది ఏళ్ల తరబడి పనులు పెండింగ్‌లో పెట్టడం, ఎవరో వీఐపీలు వస్తున్నారని పనులు పూర్తి చేయడం పలు విమర్శలకు తావిస్తోంది.


మురుగు తొలగిస్తున్న దృశ్యం

ప్రపంచ దేశాల్లో భారత్‌కు అగ్రస్థానం

- రాజ్యసభ సభ్యుడు టీజీ వెంకటేశ్
- టీజీవీ కళాక్షేత్రంలో ముగిసిన 'జై జవాన్ కల్చరల్ ఫెస్ట్'



మాట్లాడుతున్న రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్

కర్నూలు కల్చరల్, మే 16 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ దేశాల్లో భారత ప్రధాని మోదీ వల్ల భారత్ అగ్రస్థానంలో నిలిచిందని రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ అన్నారు. మన సైన్యం ఉగ్రవాద కార్యకలాపాలను అణచివేయడంలో చేసిన ఆపరేషన్ సిందూర్ కార్యక్రమం ప్రపంచ ప్రశంసలు అందుకుందన్నారు. నగరంలోని టీజీవీ కళాక్షేత్రం వారం రోజులుగా కొనసాగిన జై జవాన్ కల్చరల్ ఫెస్ట్ శుక్రవారం రాత్రి ఘనంగా ముగిసింది. ముఖ్యఅతిథిగా హాజరైన టీజీ వెంకటేశ్ తొలుత జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాలను ప్రారంభించారు. అనంతరం భరత మాత చిత్ర పటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ఆయన జన్మదిన భారీ కేక్‌ను కట్‌చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వారం రోజుల నుంచీ దేశభక్తిని ప్రబోధించే కార్యక్రమాలు టీజీవీ కళాక్షేత్రంలో ఏర్పాటు చేస్తూ దేశ సైనికులకు సంఘీభావంగా కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. తమ కుటుంబంలో తాత తండ్రుల నుంచీ స్వాతంత్ర్య సమరయోధులనీ, దేశభక్తి, సేవా సహకార గుణాలు కలవారిని గుర్తు చేశారు. కర్నూలు రాష్ట్రంలోనే అగ్రస్థానంలో ఉండేటట్లు తన కుమారుడు మంత్రి టీజీ భరత్ కృషి చేస్తున్నారని తెలిపారు. చిత్ర నిర్మాత, పారిశ్రామికవేత్త బీవీ రెడ్డి మాట్లాడుతూ రాయలసీమ ప్రాంతంలోనే మహోన్నతమైన వ్యక్తిగా టీజీ వెంకటేశ్ అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు. కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య మాట్లాడుతూ కళాక్షేత్రంలో రాష్ట్రంలోనే ఎక్కడా లేని విధంగా జై జవాన్ కల్చరల్ ఫెస్ట్‌ను నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం జాతీయ కార్యదర్శి నక్కలమిట్ట శ్రీనివాసులు, కాపు సంఘం రాష్ట్ర నాయకుడు ఆర్జా రామకృష్ణ తదితరులు మాట్లాడారు.

నవ్వులు పూయించిన జబర్దస్త్ కళాకారులు

జై జవాన్ కల్చరల్ ఫెస్ట్‌లో ముగింపు వేడుకల్లో భాగంగా జబర్దస్ కళాకారుల హాస్యవల్లరి కార్యక్రమం ఆసాంతం ప్రేక్షకులను అలరింపజేసింది. జబర్దస్త్ కళాకారులు అప్పారావు, వినోదిని, గడ్డం నవీన్, కార్తీక్, రాజమౌళి ప్రదర్శించిన స్కిట్లు ప్రేక్షకులను అలరించాయి. అంతకు ముందు నాట్యాచార్యుడు కరీముల్లా బృందం దేశభక్తిని చాటిచెబుతూ చేసిన నృత్య రూపకాలు ఆకట్టుకున్నాయి. అలాగే గజల్ గాయకుడు మహమ్మద్ మియా బృందం జానపద గీతాలు దేశ భక్తిని చాటి చెప్పాయి. ఈ కార్యక్రమంలో జీవీ శ్రీనివాసరెడ్డి, సంగా ఆంజనేయులు, జీవీ రమణ, యాంగటేశ్వరప్ప తదితరులు పాల్గొన్నారు.


జబర్దస్త్ కళాకారుల ప్రదర్శన



బీపీడితులు

- రోజురోజుకూ పెరుగుతున్న హైపర్ టెన్షన్ బాధితులు
- 30-40 ఏళ్ల వయస్సు ఉన్నవారే అధికం
- మెదడు, కిడ్నీ, గుండె సమస్యలకు దారి
- జీవన శైలి మార్పులు, మందులతో అదుపు
- నేడు ప్రపంచ రక్తపోటు దినం

కర్నూలు హాస్పిటల్, మే 16(ఆంధ్రజ్యోతి): అధిక రక్తపోటు (హైబీపీ) సైలెంట్ కిల్లర్. ఇటీవల కాలంలో హైబీపీ బాధితుల సంఖ్య పెరుగుతుంది. ఒకప్పుడు పెద్దవారిలో కనబడే బీపీ. ప్రస్తుతం 30, 40 ఏళ్ల వయస్సు వున్న వారిలో కనబడుతుంది. బీపీ వల్ల మెదడు, కిడ్నీ, గుండె, వంటి తీవ్ర సమస్యలకు దారితీస్తుంది. రక్తానికి గొడ్డలిపెట్టులా మారిన హైబీపీని జీవన శైలి మార్పులు, మందులతో సులభంగా అదుపులో ఉంచుకోవచ్చు. మనదేశంలో 19 కోట్ల మంది హైబీపీతో బాధపడుతున్నారు. వీరిలో దాదాపు 50 శాతం మందికి జబ్బు ఉన్న సంగతే తెలియకపోవడం విశేషం. తెలిసిన వారిలో ప్రతి ఐదు మందిలో నలుగురే సరైన చికిత్స తీసుకుంటున్నారు. బీపీకి ఒత్తిడి, ఆహారపు అలవాట్లు, నిద్రలేమి కారణా లు కాగా, 40 ఏళ్లు దాటినవారిలో బీపీ సర్వసాధారణంగా మారింది. హైపర్‌టెన్షన్ గురించి ప్రజల్లో అవగాహన కల్పించే లక్ష్యంతో ప్రతి సంవత్సరం మే 17న ప్రపంచ రక్తపోటు దినంను నిర్వహిస్తున్నారు. 'మీ రక్తపోటును ఖచ్చితంగా కొలవండి.. దానిని నియంత్రించండి.. ఎక్కువ కాలం జీవించండి' అన్న నినాదాన్ని వరల్డ్ హైపర్‌టెన్షన్ లీగ్ ఈ ఏడాది నినాదాన్ని ఇచ్చింది.

- అధిక రక్తపోటుతో కంట్లోని రక్త నాళాలు దెబ్బతిని చూపు మందగించే ప్రమాదం ఉంది.
- ఆహారంలో ఉప్పు బాగా తగ్గించుకోవాలి. చిప్స్, నిల్వ పచ్చళ్లు తినడం, పెరుగు మజ్జిగలో ఉప్పు కలపడం మానివేయాలి.
- ఆకుకూరలు, పండ్లు, ఎక్కువగా తినాలి
- వెన్న తీసిన పాలు, పెరుగు వాడుకోవాలి.
- రోజుకు 45నిమిషాలు చొప్పున వారానికి కనీసం ఐదు రోజులు వ్యాయా మం చేయాలి
- అధిక బరువు తగ్గించుకోవాలి. ఒక కిలోబరువు తగ్గినా రక్తపోటు 1 ఎంఎంహెచ్‌జీ తగ్గుతుంది.
- సిగరెట్లు, చుట్టలు, బీడీలు తాగితే రక్తనాళాల గోడలు దెబ్బతింటాయి. మద్యంతో రక్తపోటు పెరుగుతుంది. దీని జోలికి వెళ్లకపోవడం మంచిది.

అధిక రక్తపోటును..

అధిక రక్తపోటును రెండు రకాలుగా విభజించవచ్చు. ఒకటి ఇతరత్ర సమస్యలతో ముడిపడనిది (ప్రైమరీ హైపర్ టెన్షన్) 95 శాతం కనిపించేది బీపీ ఇదే. రెండోది ఇతర జబ్బులతో ముడిపడినది (సెకండరీ హైపర్ టెన్షన్) కిడ్నీ వైఫల్యం, థైరాయిడ్, అడ్రినల్ గ్రంధి సమస్యలు గర్భిణుల్లో వచ్చే బీపీ, పుట్టుకతోనే గుండె రక్తనాళాల్లో లోపాలు ఉండటం. రక్తనాళాల లోపల కందిపోయి, వాపు తలెత్తడం వంటివి దీనికి దోహదం చేస్తాయి.

130/80 కన్నా తక్కువగా ఉంటే..

130/80 కన్నా తక్కువగా ఉంటే బీపీ నార్మల్. 140/90 కన్నా ఎక్కువగా ఉంటే హైపర్‌టెన్షన్ బీపీ ఉన్నట్లు గుర్తించాలి. రెండు, మూడు సార్లు నిపుణులైన వైద్యులతో చెక్ చేయించుకుని 140/90 కంటే ఎక్కువగా ఉండే హైపర్‌టెన్షన్ బీపీ ఉన్నట్లు భావించి వైద్యుల సలహా మేరకు మందులు వాడాలి. రక్తపోటును ని యంత్రించడానికి రకరకాల మందులు అందుబాటులో ఉన్నాయి. ఎవరికి ఏ మందు అవసరమనేది ఆయా వ్యక్తుల ఆరోగ్యస్థితిని బట్టి నిర్ధారిస్తారు.

గుండె జబ్బు : గుండె రక్తనాళాల్లో పూడికలు ఏర్పడితే గుండెపోటు రావొచ్చు. దీర్ఘకాలికంగా రక్తపోటు ఎక్కువగా ఉంటే గుండె కండరం మందు కావొచ్చు. దీంతో కండరం వ్యాకోచించే స్వభావం తగ్గి ఫలితంగా ఒత్తిడి పెరిగి, గుండె వైఫల్యానికి దారి తీస్తుంది.

పక్షవాతం : మెదడు రక్తనాళాల్లో పూడికలు గలవారికి సమస్యలు వస్తాయి. మెదడులో ఆయా భాగాలకు రక్తసరఫరా ఆగిపోయి పక్షవాతం తలెత్తవచ్చు. రక్తనాళాల్లో పూడికలు ఏర్పడితే మూత్రపిండాలకు రక్తసరఫరా తగ్గిపోతుంది. అదే పనిగా రక్తపోటు ఎక్కువగా ఉండటం మూలంగా కిడ్నీల పనితీరు తుంది.

ప్రతి రోజు ఓపీకి వంద మంది



ప్రతి రోజు ఓపీ నెంబరు9లో 100 మంది హైపర్ టెన్షన్ బాధితులు వస్తుంటారు. ఈ రోగులకు ఎలాంటి లక్షణాలు కనిపించవు. బీపీ ఉంటే రెగ్యులర్‌గా మందులు వాడాలి. 40 ఏళ్లు దాటినవారు ప్రతి ఆరు నెలలకు ఒకసారి రెగ్యులర్‌గా బీపీ పరీక్షలు చేయించుకోవాలి.


- డా.డి.శ్రీరాములు, సీనియర్ ప్రొఫెసర్, జనరల్ మెడిసిన్, జీజీహెచ్, కర్నూలు

పెద్ద ప్రమాదం..



అధిక రక్తపోటుతో పెద్ద ప్రమాదం ఉంటుంది. పైకి ఎలాంటి లక్షణాలు లేకపోవడం, రక్తపోటు పెరిగినా మామూలుగానే ఉంటారు. హైపర్ టెన్షన్ ఎక్కువై అవయవాలు దెబ్బతిని హాస్పిటల్‌కు ఇటీవల వచ్చేవారి సంఖ్య పెరుగుతుంది. రక్తపోటును తగ్గించే చికిత్సతో పక్షవాతం ముప్పు 40శాతం, గుండె వైఫల్య ప్రమాదం 50 శాతం, హార్ట్ ఎటాక్‌లు 20-25 శాతం తగ్గించొచ్చు.

- మీనుగ శ్రీనివాసులు, అసిస్టెంట్ ప్రొఫెసర్ జనరల్ మెడిసిన్, జీజీహెచ్, కర్నూలు



విద్యుత్ శాఖపై ఏసీబీ దాడులు

- డిప్యూటీ ఈఈ, ఔట్ సోర్సింగ్ ఉద్యోగిపై కేసు




పట్టుబడ్డ ప్రతాప్(ఔట్ సోర్సింగ్), డిప్యూటీ ఈఈ రవికాంత్ చౌదరి

రుద్రవరం, మే 16 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ శాఖపై ఏసీబీ అధికారులు శుక్రవారం దాడులు నిర్వహించారు. డిప్యూటీ ఈఈ, ఔట్ సోర్సింగ్ ఉద్యోగిపై కేసు నమోదు చేసినట్లు ఏసీబీ డీఎస్పీ తెలిపారు. వివరాలు.. మండలంలోని చిన్నకంబలూరు గ్రామానికి చెందిన రైతు లింగమూర్తి తన కుమారులైన శేఖర్, శివలింగమూర్తి అనే ఇరువురి పేర్లపై ట్రాన్స్‌ఫార్మర్, విద్యుత్ స్తంభాల కోసం 21.5.2024 తేదీన దరఖాస్తు చేసుకున్నాడు. విద్యుత్ అధికారులు అంచనాలు సిద్ధంచేశారు. వాటికి సంబంధించి రూ.18640లు 3.7.2024లో రైతు చెల్లించాడు. విద్యుత్ డిప్యూటీ ఈఈ రవికాంత్‌చౌదరి వద్దకు వెళ్లి ట్రాన్స్‌ఫార్మర్, స్తంభాల కోసం సంప్రదించారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగి ప్రతాప్‌ను సంప్రదించాలని డిప్యూటీ ఈఈ సూచించారు. ప్రతాప్ రూ.40వేలు డిమాండ్ చేయగా రూ.30వేలకు బేరం కుదుర్చుకున్నారు. శుక్రవారం సాయంత్రం రైతులు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి ప్రతాప్‌కు రూ.30వేలు అందించారు. వెంటనే ఏసీబీ సిబ్బంది దాడిచేసి ఉద్యోగిని, నగదును స్వాధీనం చేసుకున్నారు. డిప్యూటీ ఈఈతో పాటు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగిపై కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. సీఐలు క్రిష్ణయ్య, రాజ ప్రభాకర్, శ్రీనివాసరెడ్డి, శ్రీనివాసులు, మోహన్, సిబ్బంది పాల్గొన్నారు.



వివరాలను వెల్లడిస్తున్నఏసీబీ డీఎస్పీ సోమన్న

నమ్మించి.. మోసగించాడు

- అన్నదాతను దగా చేసిన బడి పంతులు
- పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నం

ఆళ్లగడ్డ, మే 16(ఆంధ్రజ్యోతి): రైతన్నను నమ్మించి మోసగించాడు ఓ బడి పంతులు. దిక్కు తోచని స్థితిలో ఆరైతు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. బాధిత రైతు తెలిపిన వివరాలు.. స్థానిక ఎద్దుల పాపమ్మ ప్రభుత్వ పాఠశాలలో బాబు అనే వ్యక్తి టీచర్ పనిచేస్తున్నాడు. రైతు కోటేశ్వరరావుకు చెందిన పొలాన్ని తీసుకుని ప్లాట్లు వేసేందుకు బాబు సిద్ధమయ్యాడు. ఈ మేరకు కొంత అడ్వాన్స్‌ను రైతు చెల్లించాడు. వెంచర్ వేసి ప్లాట్లు అమ్ముకొని సొమ్ము చేసుకున్నాడు. చివర్లో లెక్కలు చేసి డబ్బులు ఇస్తానని నమ్మి బలికి విడతలవారీగా డబ్బులు ఇస్తూ మొత్తం పొలం రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకున్నాడు. తనకు రావాల్సిన పదిలక్షలు చెల్లించాలని రైతు అడిగాడు. దీంతో అతడిని బెదిరించాడు. కోటేశ్వరరావు అధికారులను, నాయకులను ఆశ్రయించినా ఫలితం లేదు. దీంతో మానసికంగా తీవ్ర ఒత్తిడికి గురై శుక్రవారం పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన చుట్టుపక్కల వారు రైతును హుటాహుటిన స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో నంద్యాల ఆస్పత్రికి తరలించారు. ఉన్నతాధికారులు స్పందించి తన సమస్యను పరిష్కరించాలని బాధిత రైతు కోరుతున్నాడు.



చికిత్స పొందుతున్న రైతు కోటేశ్వరరావు

చల్లా విఘ్నేశ్వరరెడ్డిపై కేసు నమోదు



బనగానపల్లె మే 16 (ఆంధ్ర జ్యోతి): అవుకు పట్టణానికి చెందిన వైసీపీ నాయకుడు చల్లా విఘ్నేశ్వరరెడ్డిపై శుక్రవారం పోలీసులు కేసు నమోదు చేశారు. చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం జరిగిన రథోత్సవంలో టీడీపీ ఎస్టీసెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటరమణ నాయక్ మీదికి విఘ్నేశ్వరరెడ్డి దూసుకెళ్లి ఘర్షణకు దిగాడు. అతడి ఫిర్యాదు మేరకు విఘ్నేశ్వరరెడ్డితో పాటు పోతిరెడ్డి శ్రీధర్‌రెడ్డి, గొల్ల మనోహర్, చాకలి వెంకటేశ్వర్లుపై కేసులు నమోదు చేశారు. చెన్నకేశవస్వామి ఆలయం దేవదాయశాఖ పరిధిలో ఉన్నప్ప టికీ గతంలో ఏకపక్షంగా చల్లా కుటుంబీకుల ఆధ్వర్యంలో రైతుసంఘం వారు చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవా లను నిర్వహించేవారు. ఈఏడాది దేవాదాయశాఖ అధికారులు బ్రహ్మోత్సవాల నిర్వహణకు ఉత్సవ కమిటీని ఏర్పాటు చేసి బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తు న్నారు. ఇది చల్లా కుటుంబీకులకు మింగుడు పడలేదు. దేవుడు రథం తేరువీధి నుంచి చల్లా ఇంటిముందు వెళ్లాల్సి ఉంటుంది. అక్కడికి వచ్చే సరికి నిలువకుండ ముందుకు వెళ్లాలని విఘ్నేశ్వరరెడ్డి వెంకటరమణ నాయక్‌తో ఘర్షణకు దిగాడు. సీఐ మంజునాథ రెడ్డి, ఎస్ఐ రాజారెడ్డి అక్కడకు చేరుకొని విఘ్నేశ్వర రెడ్డిని పక్కకు తీసుకెళ్లారు. అప్పటికి ఘర్షణ సద్దుమణిగి రథోత్సవం సజావుగా సాగింది. వెంకటరమణనాయక్ ఫిర్యాదు మేరకు నలుగురిపై పోలీసులు కేసు నమోదుచేశారు.

చల్లాపై తప్పుడు కేసు నమోదు : కాటసాని

బేతంచెర్ల: చల్లా విఘ్నేశ్వరరెడ్డిపై తప్పుడు కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపడం తగదని బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి అన్నారు. శుక్ర వారం సాయంత్రం బేతంచెర్ల పోలీస్‌స్టేషన్‌లో కాటసాని రామిరెడ్డి విలేకరులతో మాట్లా డారు. రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం అమల వుతుందని, అదే విదంగా బనగానపల్లె నియోజకవర్గంలో కూడా రెడ్‌బుక్ ర్యాంగంను రోడ్డు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి అమలు చేస్తున్నారన్నారు. విఘ్నేశ్వరరెడ్డి ఎలాంటి తప్పు చేయలేదన్నారు. వైసీపీ నాయకులు మాజీ ఎంపీపీ చల్లా రాజశేఖర్ రెడ్డి, చల్లా రఘురామిరెడ్డి, కాటసాని ప్రసాద్ రెడ్డి, రామ్మోహన్ రెడ్డి, చల్లా విఘ్నేశ్వరరెడ్డిని పోలీస్‌స్టేషన్‌లో పరామర్శించారు.

ప్రగతి పథాన..



మొండిగోడలతో ఉర్దూ విశ్వవిద్యాలయం

(5వ పేజీ తరువాయి)

పత్తికొండ మండలం కనకదిన్నె వద్ద రెండు ఎకరాల్లో టమోటా ప్రాసెసింగ్ యూనిట్‌కు రూ.11 కోట్లతో శంకుస్థాపన చేశారు.

- ఎమ్మిగనూరు మండలం బనవాసి జెర్సీ పశుక్షేత్రంలో చేనేతలకు ఉపాధి లక్ష్యంగా 97.24 ఎకరాల్లో మెగా టెక్స్‌టైల్ పార్క్‌కు శంకుస్థాపన చేశారు.

జలసిరులు రావాలి.. కరువు తీరాలి

- మంత్రాలయం, ఎమ్మిగనూరు, కోడుమూరు నియోజకవర్గాల్లో కరువు, వలసలు నివారించాలని 2019లో నాటి టీడీపీ ప్రభుత్వం ఆర్డీఎస్ కుడి కాలువ చేపట్టింది. 40 వేల ఎకరాలకు సాగు, 1.20 లక్షల జనాభాకు తాగునీరు అందించాలని రూ.1,985.42 కోట్లతో పనులు మొదలు పెట్టారు. ప్రధాన కాలువ, కోటేకల్లు, కోసిగి, పెద్దకడుబూరు, చిన్నమరివీడు జలాశయాల నిర్మాణాలు చేయాలి. వైసీపీ ప్రభుత్వంలో అటకెక్కించారు.
- ఆలూరు, ఆదోని నియోజకవర్గాల్లో 80 వేల ఎకరాలకు సాగునీరు, 1.50 లక్షల జనాభాకు సాగునీటి అందించాలని వేదవతి ఎత్తిపోతల పథకం రూ.1,94.80 కోట్లతో చేపట్టి పనులు మొదలు పెట్టారు. ఆ తరువాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల నిర్లక్ష్యం కారణంగా పురోగతి పడకేసింది. వేదవతి ప్రాజెక్టు పనులు 6 శాతమే జరిగాయి.
- గాజులదిన్నె జలాశయం సామర్థ్యం 4.5 టీఎంసీలు నుంచి 5.50 టీఎంసీలకు పెంచాలనే ఉద్దేశంతో గత వైసీపీ ప్రభుత్వంలో రూ.35 కోట్లతో పనులు చేపట్టారు. కాంట్రాక్టరుకు సకాలంలో బిల్లులు ఇవ్వకపోవడంతో అసంపూర్తిగా వదిలేశారు.
- హంద్రీనీవా ప్రాజెక్టు పత్తికొండ (పందికోన) జలాశయం కుడి, ఎడమ కాలువలు, పంటల కాలువలు అసంపూర్తిగా ఉన్నాయి. పత్తికొండ, ఆలూరు నియోజకవర్గాల్లో 61,394 ఎకరాలకు సాగునీరు అందని ద్రాక్షగా మారింది. అసంపూర్తి పనులకు రూ.202 కోట్లు ఇవ్వాలి.
- హంద్రీనీవా నుంచి 68 చెరువులను నింపే ఎత్తిపోతల, గురురాఘవేంద్ర ఎత్తిపోతల పథకాల నిర్వహణకు నిధులు ఇవ్వాలి.
- అలగనూరు జలాశయం 2.96 టీఎంసీలు సామర్థ్యం. మట్టి ఆనకట్ట కుంగిపోయి ఐదేళ్లు దాటింది. రూ.26.33 కోట్లు నిధులు మరమ్మతులు చేపట్టాలి.

- కేసీ కెనాల్ కింద ఉమ్మడి కర్నూలు, కడప జిల్లాల్లో 2.65 లక్షల ఎకరాలకు సాగునీరు, కర్నూలు నగరానికి తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారం కోసం 20 టీఎంసీల సామర్థ్యంలో తుంగభద్రపై గుండ్రేవుల జలాశయం నిర్మాణానికి గత టీడీపీ ప్రభుత్వం రూ.2,980 కోట్లు మంజూరు చేస్తే.. అంతర్రాష్ట్ర సమస్య అని వైసీపీ హయాంలో పక్కన పడేశారు. కూటమి ప్రభుత్వం రావడంతో ఆశలు చిగురిస్తున్నాయి.

పేదలకు టిడ్కో యోగం ఎప్పుడో?

ఉమ్మడి జిల్లాలో గత టీడీపీ ప్రభుత్వం ఏపీ టిడ్కో కింద 52,318 ఇళ్లు మంజూరు చేసింది. వైసీపీ హయాంలో 21,038 ఇళ్లను రద్దుచేశారు. 31,289 ఇళ్లలో 23,645 ఇళ్లలో మెజార్టీ ఇళ్లు వంద శాతం పూర్తవ్వగా.. కొన్ని టీడీపీ ప్రభుత్వంలో 90 శాతానికి పైగా పూర్తయ్యాయి. వైసీపీ హయాంలో ఒక్క ఇటుక కూడా పేర్చలేదు. 23,645 ఇళ్లకు గానూ 7,007 ఇళ్ల లబ్ధిదారులకు తాళాలు అప్పగించారు. కనీస సౌకర్యాలు లేకపోవడంతో నేటికీ 150-200 లబ్దిదారులు కూడా నివాసం లేరు. కర్నూలు జిల్లాలో కర్నూలు, ఆదోని, ఎమ్మిగనూరులో 16,595 ఇళ్లు, నంద్యాల జిల్లాలో నంద్యాల, డోన్, ఆళ్లగడ్డలో 7,050 ఇళ్లు గృహ ప్రవేశానికి సిద్ధంగా ఉన్నాయి. మౌలిక వసతులు కల్పించి పేదలకు అప్పగించాల్సిన అవసరం ఉంది.

తారస్థాయికి కూటమిలో కుమ్ములాటలు

రాష్ట్రంలో కూటమి పార్టీలు టీడీపీ, జనసేన, బీజేపీ అధిష్ఠానం మధ్య సఖ్యత, సమన్వయం ఉంది. కానీ నియోజకవర్గాల్లో సమన్వయం కొరవడడంతో కూటమి పార్టీ నాయకుల మధ్య కుమ్ములాటలు కొనసాగుతున్నాయి. ముఖ్యంగా ఆదోని నియోజకవర్గంలో బీజేపీ ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారధి, టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడుల మధ్య సమన్వయంలోపం టీడీపీ కార్యకర్తలకు తీవ్ర నష్టం చేకూర్చుతుంది. ఇన్‌చార్జి మంత్రి నిమ్మల రామానాయుడు ఇద్దరి మధ్య సయోధ్య కుదిరిందని, అభివృద్ధి, సంక్షేమ పథకాల్లో టీడీపీకి 60 శాతం, జనసేన, బీజేపీకి 40 శాతం అందేలా ఒప్పుకున్నారని కార్యకర్తల సమక్షంలో చెప్పారు. నెలలు గడుస్తున్నా ఆ ఒప్పందం అమలు కావడం లేదు. వైసీపీ నుంచి బీజేపీలో చేరిన వారికే ఎమ్మెల్యే ప్రాధాన్యత ఇస్తున్నారనే టీడీపీ ఆరోపణ. సమన్వయం చేయకపోతే ఆ నియోజకవర్గంలో టీడీపీ తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉంది. ఆలూ రు, మంత్రాలయం నియోజక వర్గాల్లో టీడీపీ వర్గాల్లో విభేదాలు పార్టీకి నష్టం చేకూర్చేలా మారాయి. మిగిలిన నియోజకవర్గాల్లో కూడా కూటమి పార్టీల మధ్య ఆశించిన స్థాయిలో సమన్వయం కనిపించడం లేదు. ప్రతిపక్షంలో ఐదేళ్లు టీడీపీ జెండా చేతపట్టి వైసీపీ దుర్మార్గపు పాలనకు వ్యతిరేకంగా పోరాటాలు చేసిన వారిని గుర్తించడం లేదని టీడీపీ నాయకులు, కార్యకర్తలు మదనపడుతున్నారు. అధికారం వచ్చాక ఎమ్మెల్యేలు తమను పక్కన పెట్టి.. వైసీపీ నుంచి వచ్చిన వారికే పనులు, పదవులు ఇస్తున్నారని కార్యకర్తల ఆవేదన. సీఎం చంద్రబాబు ప్రత్యేక దృష్టి సారించకపోతే రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో తీవ్రంగా నష్టపోయే ప్రమాదం లేకపోలేదని సీనియర్ నేతలే అంటున్నారు.

వీటిపై దృష్టి సారించాలి

- కర్నూలు సర్వజన వైద్యశాలతో పాటు మెడికల్ కళాశాలల భవన నిర్మాణాలు రూ.450 కోట్లతో, ఆదోని మెడికల్ కళాశాల, బోధనాస్పత్రి నిర్మాణాలు రూ.480 కోట్లతో చేపట్టారు. వివిధ దశల్లో ఆ నిర్మాణాలు ఆపేశారు. వీటిని పూర్తి చేసి పేదలకు వైద్య సేవలు మెరుగు పరచాలి.
- రాయలసీమ యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాల 192 ఎకరాల్లో జగన్నాథగట్టుపై నిర్మాణం చేపట్టారు. రూసా నిధులు రూ.20 కోట్లు ఇచ్చారు. పునాదులతో పనులు ఆగిపోయాయి.
- డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ విశ్వావిద్యాలయం శాశ్వత భవనాలు ఓర్వకల్లు విమానాశ్రయం పక్కనే 144.92 ఎకరాల విస్తీర్ణంలో ఫేజ్-1 కింద రూ.18 కోట్లతో గత టీడీపీ ప్రభుత్వంలో చేపడితే వైసీపీ హయాంలో ఆపేశారు.
- జగన్నాథగట్టుపై 52 ఎకరాల్లో రూ.80 కోట్లు కేంద్ర ప్రభుత్వ నిధులతో చేపట్టిన 'క్లస్టర్ యూనివర్సిటీ' పనులు అసంపూర్తిగా ఆగిపోయాయి.
- ఆదోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల శాశ్వత పక్కా భవనాలు నిర్మాణం, కోడుమూరు పట్టణంలో తాగునీటి సమస్య పరిష్కారానికి గాజులదిన్నె ప్రాజెక్టు నుంచి పైపులైన్ హామీలు అమలు చేయాలి.
- కర్నూలు స్మార్ట్‌సిటీగా అభివృద్ధి చేస్తామని ఎన్నికల్లో ఇచ్చిన ప్రధాన హామీ. అవసరమైన నిధులు మంజూరు చేసి ఆ దిశగా పనులు చేపట్టాలి.



అసంపూర్తిగా ఆదోని మెడికల్ కాలేజీ భవనాలు

కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుకు ఘనస్వాగతం

ఓర్వకల్లు, మే 16 (ఆంధ్రజ్యోతి): కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజారపు రామ్మోహన్ నాయుడు ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో శుక్రవారం ఓర్వకల్లు విమానాశ్రయానికి చేరుకున్నారు. మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి కలెక్టర్ రంజిత్ బాషా, ఎంపీ బస్తిపాటి నాగరాజు, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, ఎస్పీ విక్రాంత్ పాటిల్, టీటీడీ బోర్డు సభ్యులు మల్లెల రాజశేఖర్, ఎయిర్‌పోర్టు డైరెక్టర్ విద్యాసాగర్ ఘన స్వాగతం పలికారు. ఓర్వకల్లు ఎయిర్‌పోర్టు నుంచి ప్రత్యేక వాహనంలో కర్నూలులోని ఓకార్యక్రమానికి హాజరయ్యారు. అనంతరం అనంతపురానికి బయలుదేరి వెళ్లారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులు మోహన్‌రెడ్డి, తహసీల్దార్ విద్యాసాగర్, కర్నూలు రూరల్ సీఐ చంద్రబాబు నాయుడు, ఎస్ఐ సునీల్‌కుమార్ పాల్గొన్నారు.



కేంద్ర మంత్రికి మొక్కను ఇచ్చిన ఎమ్మెల్యే గౌరు చరిత

విజయవాడకు విమాన సౌకర్యాన్ని కల్పించండి

- కేంద్రమంత్రికి ఎంపీ బస్తిపాటి వినతి



కేంద్ర మంత్రికి వినతిపత్రం ఇస్తున్న ఎంపీ నాగరాజు

కర్నూలు, మే 16 (ఆంధ్రజ్యోతి): కర్నూలు నుంచి విజయవాడకు త్వరలో విమాన సర్వీసులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజారపు రామ్మోహన్ నాయుడును ఎంపీ బస్తిపాటి నాగరాజు కోరారు. ఈ మేరకు ఆయన కేంద్రమంత్రికి వినతిపత్రం ఇచ్చారు. ఇదిలా ఉండగా వినతిపత్రం ఇచ్చిన కొన్ని గంటలకే రామ్మోహన్ నాయుడు స్పందిస్తూ త్వరలోనే ఈ సర్వీసులు కొనసాగిస్తామని స్పష్టమైన హామీ ఇచ్చినట్లు ఎంపీ నాగరాజు ఆంధ్రజ్యోతికి వివరించారు. ఎన్నో ఏళ్ల కలగా ఉన్న విమానయాన సర్వీసులు ప్రారంభిస్తే అమరావతికి వెళ్లేందుకు ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు.

సూపర్‌సిక్స్ హామీలు అమలు చేయాలి

- నంద్యాల డీసీసీ అధ్యక్షుడు లక్ష్మీనరసింహా యాదవ్



మాట్లాడుతున్న లక్ష్మీనరసింహ యాదవ్

కల్లూరు, మే 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం సూపర్‌సిక్స్ హామీలను అమలు చేయడంతో విఫలమైందని నంద్యాల డీసీసీ అధ్యక్షుడు జే.లక్ష్మీనరసింహ యాదవ్ విమర్శించారు. శుక్రవారం నంద్యాల చెక్‌పోస్టు సమీపంలోని దామోదరం సంజీవయ్య భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. మేనిఫెస్టోలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన సామాజిక పింఛన్లు హామీలన్నీ అటకెక్కించారని ఆరోపించారు. ముఖ్యంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు 50 ఏళ్లకే పింఛన్, యువగళం కింద నిరుద్యోగులకు రూ.3వేల భృతి, 77 జీఓ రద్దుచేసి పీజీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాలను ఇంకెప్పుడు అమలు చేస్తారన్నారు. ఎన్నికల్లో ప్రజలకు హామీ ఇచ్చిన మేరకు సూపర్‌సిక్స్ పథకాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. బాల స్వామి, నాగలింగం, జనార్ధన్, ఉస్మాన్‌భాషా, రజాక్‌వలి పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

కర్నూలు క్రైం, మే 16 (ఆంధ్రజ్యోతి): ఉలిందకొండ పోలీస్ స్టేషన్ పరిధిలో చిన్నటేకూరు గ్రామ సమీపంలో విద్యుదాఘాతానికి గురై శ్రీనివాసులు (35) అనే వ్యక్తి మృతి చెందాడు. అలంపూరు మండలం సుల్తానాపురం గ్రామానికి చెందిన శ్రీనివాసులు కర్నూలు కృష్ణానగర్‌లో ఓ ఇల్లు అద్దెకు తీసుకుని నివాసం ఉంటున్నాడు. ఈయన కిమ్స్ ఆసుపత్రి వైద్యుడు నారాయణరెడ్డి దగ్గర కారు డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. శుక్రవరాం చిన్నటేకూరు సమీపంలోని నారాయణరెడ్డి తన సొంత పొలానికి డ్రైవర్‌తో పాటు వెళ్లాడు. గేటు అడ్డంగా విద్యుత్ తీగలు వేలాడుతుండడంతో ఆ తీగలను తొలగించాలని సూచించాడు. ఆ తీగలను తొలగించే క్రమంలో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే కుప్పకూలి పోయాడు. ఆయనను వెంటనే చికిత్స నిమితం కిమ్స్ ఆసుపత్రికి తరలించగా. ఆసుపత్రిలో మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు సంతానం. బంధువులు ఉలిందకొండ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రైల్వే ప్లాట్‌ఫారంపై వ్యక్తి మృతి

నంద్యాల టౌన్, మే 16 (ఆంధ్రజ్యోతి): నంద్యాల రైల్వే ప్లాట్‌ఫారంపై వీర్రాజు అనే వ్యక్తి మృతి చెందినట్లు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ ఖలీల్ తెలిపారు. గురువారం రాత్రి రెండో ప్లాట్‌ఫారంపై మృతిచెందాడు. జేబులో కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చూపించుకున్న ఓపీ ఉంది. అందులో వీర్రాజు పేరు తప్ప వివరాలేమీ లేవు. మృతదేహాన్ని నంద్యాల ప్రభుత్వాసుపత్రిలో ఉంచామని తెలిపారు.

ఒక్కటైన 75 జంటలు

- వివాహాలకు సహకరించిన మంత్రి టీజీ భరత్ కుటుంబ సభ్యులు



వివాహ వేడుకల్లో మాట్లాడుతున్న మాజీ ఎంపీ టీజీ వెంకటేష్

కర్నూలు కల్చరల్, మే 16 (ఆంధ్రజ్యోతి): కర్నూలు నగరంలో రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్, మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్ కుటుంబం ఆధ్వర్యంలో శుక్రవారం 75 జంటలు ఒక్కటయ్యాయి. టీజీ వెంకటేశ్ జన్మదినం సందర్భంగా మంత్రి కుటుంబ సభ్యులు శుక్రవారం వివాహాలు చేసుకున్న 75 జంటలకు రూ.80 వేల చొప్పున చెక్కులను అందజేశారు. ఇప్పటికే వారికి మంగళసూత్రం, వధూవరులకు వస్త్రాలు తదితర సామగ్రిని అందజేశారు. దీంతో వివాహాలు చేసుకున్న జంటలను నగరంలోని మౌర్య ఇన్‌లోని పరిణయ ఫంక్షన్ హాలులో టీజీ వెంకటేశ్ దంపతులు ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెళ్లి చేసుకొని కొత్త జీవితాన్ని ప్రారంభిస్తున్న వారు ఎటువంటి చెడు వ్యసనాలకు లోనుకాకుండా ఆరోగ్యంగా ఉంటూ సంసారాన్ని చక్కదిద్దుకోవాలని సూచించారు. తన కుమారుడు మంత్రి టీజీ భరత్‌తో పాటూ కుటుంబ సభ్యుల సహకారం ఉన్నందునే తాను సేవా కార్యక్రమాలు నిర్వహించ గలుగుతున్నానని అన్నారు. మంత్రిగా టీజీ భరత్ కూడా ప్రజలకు సేవ చేయాలనే తలంపుతో రాజకీయాల్లోకి వచ్చారని, మంత్రిగా కర్నూలు జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధికి ఎంతగానో కృషి చేస్తున్నారన్నారు. పరిశ్రమలు రాకుండా కొంతమంది అడ్డుపడుతున్నారని, వారి గురించి తెలుసుకుని అటువంటి వారికి దూరంగా ఉండాలని చెప్పారు.

మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ కర్నూలు ప్రజలకు ఏదో ఒక మంచిపని చేయాలని తన తండ్రి టీజీ వెంకటేశ్ ఆలోచిస్తుంటారని అన్నారు. 25 ఏళ్లుగా కులమతాలకు అతీతంగా సామూహిక వివాహాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తాము పెళ్లిళ్లు చేసిన జంటలన్నీ సంతోషంగా ఉండటం తమకు గర్వంగా ఉందన్నారు. తనకు తండ్రే రోల్ మోడల్ అని, ఆయనను స్ఫూర్తిగా తీసుకునే రాజకీయాల్లోకి వచ్చానన్నారు. పెట్టుబడులు తీసుకువచ్చే విషయంలో రాష్ట్రాల మధ్య ఎంతో పోటీ నెలకొందని అన్నారు. తమ ఫ్యాక్టరీ విస్తరణ చేసే విషయంలో ఇలాంటి రాజకీయాలు చేయడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో టీజీ వెంకటేశ్ సతీమణి టీజీ రాజ్యలక్ష్మి, మంత్రి భరత్ సతీమణి టీజీ శిల్పాభరత్, టీజీ కుటుంబ సభ్యులు సునీల్, కృష్ణజ్యోత్స్న, రవిరాజ్, మౌర్య తదితరులు పాల్గొన్నారు.

రాయలసీమ ప్రాంతంపై దృష్టి పెట్టండి



మాట్లాడుతున్న షేక్ జిలానీ బాషా

కర్నూలు అర్బన్, మే 16(ఆంధ్రజ్యోతి): వెనుకబడిన రాయలసీమ ప్రాంతంపై దృష్టి పెట్టాలని కర్నూలు సిటీ కాంగ్రెస్ అధ్యక్షులు షేక్ జిలానీ బాషా అన్నారు. శుక్రవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల ముందు 26 హామీలు ఇచ్చారు కానీ ఆ హామీలను ఇంత వరకు నెరవేర్చలేదని ఇకనైనా వాటిని వెంటనే అమలు చేయాలని కోరారు. రాయలసీమలో గుండ్రేవుల, వేదవతి, హంద్రీ నీవా ప్రాజెక్టులను వెంటనే పూర్తి చేయాలని, ఈ ప్రాజెక్టులు పూర్తయితే రైతులకు సాగు నీరు అందజేసి పంటను సస్యశ్యామలం చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు అనంతరత్నం మాదిగ, లాజరస్, ఆర్ ప్రతాప్, కిషోర్, షబ్బీర్, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల నిరవధిక సమ్మె

గూడూరు మే 16 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ ఇంజనీరింగ్ సెక్షన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు తమ సమస్యల పరిష్కారం కొరకు నిరవధిక సమ్మెలోకి వెళ్తున్నట్లు గూడూరు మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ నాయకులు అరవింద్, రూపేశ్వరరావు అన్నారు. శుక్రవారం గూడూరులోని పాతబస్టాండు ప్రాంతంలో మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు సమ్మె చేపట్టారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ మధు, జయన్న, అంజి, ప్రభాకర్, బసవరాజు, హరి, పఠాన్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనులు ప్రారంభించాలి

ఓర్వకల్లు, మే 16 (ఆంధ్రజ్యోతి): కేతవరం నుంచి గార్గేయాపురం, పూడిచర్ల మెట్ట వరకు ఆగిపోయిన రోడ్డు పనులు తక్షణమే ప్రారంభించాలని రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని కేతవరం గ్రామంలో ఆగిపోయిన రోడ్డు పనులను ప్రారంభించాలని ప్రజా సంఘాల నాయకులు, గ్రామస్థులతో కలిసి రోడ్డును పరిశీలించి నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. రామకృష్ణ మాట్లాడుతూ కేతవరం నుంచి గార్గేయాపురం వరకు రోడ్డు అధ్వానంగా ఉందన్నారు. ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి స్పందించి రోడ్డు మరమ్మతుకు నిధులు విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు నాగన్న, శ్రీధర్, వెంకటేశ్వర్లు, సుబ్బరాయుడు, అహ్మద్ రసూల్, బాలకృష్ణ పాల్గొన్నారు.

మహిళను కాపాడిన పోలీసులు

కర్నూలు క్రైం, మే 16 (ఆంధ్రజ్యోతి): నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో రాజీవ్ గృహ కల్పలో శుక్రవారం రాత్రి ఓ అపార్టుమెంటు ఐదో అంతస్తు నుంచి దూకి శ్రావణి అనే మహిళ ఆత్మహత్యాయత్నం చేసుకోబోయింది. కాలనీవాసులు ఎంత బతిమాలినా కిందకు రాకపోవడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. హెడ్ కానిస్టేబుల్ ఖాద్రి నచ్చజెప్పి కిందకు తీసుకువచ్చాడు. వివరాల్లోకి వెళితే గుంటూరు చెందిన శ్రావణికి కర్నూలు చెందిన తేజ ఏడాది క్రితం ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. ఇటీవలే వీరి మధ్య తరుచూ గొడవలు జరుగుతున్నాయి. ఈ నెల 13న శ్రావణి తన భర్త తేజ, అత్త, ఆడపడుచులపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. పోలీసులు కేసు నమోదు చేశారు. కేసు పెట్టినందుకు శ్రావణిని ఇంట్లోకి రానీయడం లేదు. దీంతో శుక్రవారం రాత్రి శ్రావణి తనను ఇంట్లోకి రానీయడం లేదని 5వ అంతస్తుపైకి ఎక్కి దూకి చనిపోతానని బెదిరించింది. కానిస్టేబుల్ ఖాద్రి ఆమెకు నచ్చజెప్పి స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

ఓర్వకల్లు, మే 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హెచ్.కొట్టాల బస్ స్టేజీ సమీపాన జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా.. మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. మిడ్తూరు మండలం చింతలపల్లె గ్రామానికి చెందిన బోయ చరణ్ (16) అనే యువకుడు అక్కడికక్కడే మృతి చెందగా.. ముని రంగస్వామికి తీవ్ర గాయాలయ్యాయి. ఇరువురు గ్రామంలో దేవర ఉన్న సందర్భంగా ఓర్వకల్లు మండలంలోని బ్రాహ్మణపల్లెలో బంధువులకు చెప్పి హెచ్.కొట్టాలకు ద్విచక్రవాహనంపై వెళ్తుండగా.. కొట్టాల బస్ స్టేజీ వద్ద తిరుపతి నుంచి హైదరాబాదు వెళ్లే లారీ ద్విచక్రవాహనాన్ని ఢీకొనడంతో బోయ చరణ్ అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



రైతు బజారులో ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి టీజీ భరత్



కలెక్టర్, ఎస్పీతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గౌరు చరిత

ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లు పూర్తి

కర్నూలు కలెక్టరేట్/ కల్లూరు, మే 16 (ఆంధ్రజ్యోతి) సీఎం నారా చంద్రబాబునాయుడు శనివారం కర్నూలుకు వస్తున్నారు. రైతుబజారు పరిశీలించి రైతులతో మాట్లాడుతారు. ఇందుకోసం కలెక్టర్, ఎస్పీ, మంత్రి, ఎమ్మెల్యే ఏర్పాట్లను పరిశీలించారు. సీ.క్యాంపు రైతుబజార్లో మినిట్ టూ మినిట్ సీఎం చంద్రబాబు కార్యక్రమానికి అనుగుణంగా ఏర్పాట్లు ఎలా చేశారని అధికారులను మంత్రి భరత్ అడిగి తెలుసుకున్నారు. రైతుబజార్లో ఇంకా పెండింగ్‌లో ఉన్న పారిశుధ్య పనులను వెంటనే పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు.

● ముఖ్యమంత్రి కర్నూలు పర్యటన ఏర్పాట్లను ఎమ్మెల్యే గౌరుచరిత పరిశీలించారు. శుక్రవారం కేంద్రీయ విద్యాలయం వద్ద ఉన్న ప్రజావేదిక దగ్గర జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రజావేదిక సభతో పాటు నియోజకవర్గ టీడీపీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు 500 మందితో సీఎం చంద్రబాబునాయుడు ముఖాముఖి నిర్వహిస్తారని గౌరుచరిత సూచించారు. అదేవిధంగా 20వ వార్డు ధనలక్ష్మీనగర్‌లోని పార్క్‌లో రూ.50 లక్షలతో సీఎం చంద్రబాబునాయుడు స్వచ్ఛంద్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా అభివృద్ధి పనులకు పైలాన్ ఆవిష్కరించనున్నారని తెలిపారు. నంద్యాల జిల్లా టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ నాయకులు పాల్గొన్నారు.



రైతు బజార్‌లో డాగ్‌స్క్వాడ్ తనిఖీలు



బందోబస్తు కోసం వచ్చిన పోలీసులు

ఎటూ తేలని క్యాంటీన్ వ్యవహారం

- ఎటువంటి నిర్ణయాలు తీసుకోకుండా ముగిసిన కౌన్సిల్ సమావేశం
- మధ్యలోనే వెళ్లిన కొందరు ప్రొఫెసర్లు



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్, హాజరైన వైద్యులు



కర్నూలు హాస్పిటల్, మే 16 (ఆంధ్రజ్యోతి): రోజురోజుకు వివాదం అవుతుందన్న క్యాంటీన్ వివాదంపై కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ స్పందించి ఏర్పాటు చేసిన స్టాఫ్ కౌన్సిల్ సమావేశం ఎటూ తేల్చకుండా ముగిసింది. శుక్రవారం కర్నూలు మెడికల్ కాలేజీలోని కౌన్సిల్ సమావేశం మందిరంలో వైద్యులతో స్టాఫ్ కౌన్సిల్ సమావేశం ప్రిన్సిపాల్ డా.కే.చిట్టినరసమ్మ నిర్వహించారు. సమావేశానికి ఓవర్గం హాజరు కాలేదు. ఏపీజీడీఏ అధ్యక్షుడు డా.బ్రహ్మాజీ, ఉపాధ్యక్షులు డా.సోమప్ప, క్యాంటీన్ అసోసియేషన్‌కు అప్పగించాలని బైలా ప్రకారం మాకే ఇవ్వాలని, 5 సంవత్సరాలకే అగ్రిమెంటు ఉందని తెలిపారు. స్పందించిన ప్రిన్సిపాల్ క్యాంటీన్ వ్యవహారం ఇరువర్గాలు తేల్చుకోవాలన్నారు. క్యాంటీన్ లీజు ఐదు సంవత్సరాలు దాటి చాలా కాలం అయిందని, కావున క్యాంటీన్‌ను తమకు అప్పగించాలని ఏపీజీడీఏ అధ్యక్షుడు డా.బ్రహ్మాజీ కోరారు. కొందరు హెచ్‌వోడీలు మాట్లాడుతూ ఎన్ఎంసీ నిబంధన ప్రకారం క్యాంటీన్ ఎంతో అవసరమని, ఇప్పటికే వైద్యులు, విద్యార్థులు ఎంతో ఇబ్బంది పడుతున్నారని అన్నారు. ఈ విషయంపై ప్రిన్సిపాల్ మాట్లాడుతూ క్యాంటీన్ అంశం ఏపీజీడీఏకు క్యాంటీన్ నిర్వహకులకు మధ్య జరిగిన ఒప్పందమని, కావున అగ్రిమెంటు వివరాల కాపీలను అందజేయాలన్నారు. క్యాంటీన్ వ్యవహారంలో అందరు సభ్యులు కోరిన విధంగా క్యాంటీన్‌ను త్వరగా ప్రారంభించేందుకు అందుబాటులో ఉన్న అన్ని వివరాలతో కలెక్టర్, డీఎంఈకి నివేదిక సమర్పిస్తామని, ఆ తర్వాత క్యాంటీన్ సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కౌన్సిల్ సమావేశంలోనే కొందరు ప్రొఫెసర్లు మధ్యలో వెళ్లడం విశేషం. వివాదంగా మారిన క్యాంటీన్ వ్యవహారంపై ఎటువంటి నిర్ణయం తీసుకోకుండానే ముగిసింది.

ఘనంగా టీజీ వెంకటేశ్ జన్మదిన వేడుకలు



నగర బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో...



నగర బలిజ సంఘం ఆధ్వర్యంలో...

కర్నూలు కల్చరల్, మే 16 (ఆంధ్రజ్యోతి): రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ జన్మదిన వేడుకలు కర్నూలు పట్టణంలో శుక్రవారం ఘనంగా జరిగాయి. నాయకులు కేక్ కట్‌చేసి సంబరాలు చేసుకున్నారు. సంకల్‌బాగ్‌లోని టీజీ నివాసంలో టీజీ వెంకటేశ్‌ను కలిసిన వారు పూలబొకే అందజేశారు. కార్యక్రమంలో నగర బలిజ సంఘం గౌరవాధ్యక్షుడు పత్తి ఓబులయ్య, అధ్యక్షుడు గాండ్ల లక్ష్మన్న, ప్రధాన కార్యదర్శి మండ్లె రవికుమార్, సలహాదారుడు డాక్టర్ సింగంశెట్టి సోమశేఖర్, ఇతర ప్రతినిధులు ఈశ్వర్‌కుమార్, ప్రకాశ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

● రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ జన్మదిన సందర్భంగా, శుక్రవారం సంకల్‌బాగ్‌లోని ఆయన స్వగృహంలో కర్నూలు నగర బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో వేద పండితులు టీజీ వెంకటేశ్, టీజీ రాజ్యలక్ష్మి దంపతులకు వేద ఆశీర్వాదాలు అందజేశారు. నగర బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు సండేల్ చంద్రశేఖర్ రావు, సంఘ గౌరవాధ్యక్షుడు చెరువు వెంకట దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమం జరిగింది. సంఘ ప్రతినిధులు కంచుగంటల శ్యామసుందర్‌రావు, చల్లా నాగరాజు శర్మ, నాగులవరం రాజశేఖర్, సముద్రాల శ్రీధర్, టీవీ రవిచంద్రశర్మ, వేద పండితులు, అర్చక పురోహితులు కె.మహేష్ శర్మ, ప్రసన్నకుమార్ శర్మ, మామిళ్లపల్లి రాజేశ్ శర్మ, గురురాజాచార్ పాల్గొన్నారు.



టీజీ వెంకటేశ్‌కు పూలబొకే అందజేస్తున్న శిల్పి బోయ శ్రీనివాసులు

శిల్ప కళాకారులను ప్రభుత్వం ఆదుకోవాలి

శిల్ప కళాకారులను ప్రభుత్వం ఆదుకోవాలని కర్నూలుకు చెందిన శిల్పి బోయ శ్రీనివాసులు టీజీ వెంకటేశ్‌కు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ జన్మదిన సందర్భంగా సంకల్ బాగ్‌లోని టీజీ నివాసంలో పూలబొకే అందజేసి ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం శిల్పి శ్రీనివాసులు మాట్లాడుతూ తమలాంటి శిల్పులకు టీజీ వెంకటేశ్ ఆదరణ కల్పిస్తూ, కార్మికులకు ప్రోత్సహిస్తున్నారని చెప్పారు.

కర్నూలు స్పోర్ట్స్: టీజీ వెంకటేశ్ జన్మదిన వేడుకల సందర్భంగా క్రీడా సంఘాల నాయకులు టీజీ నివాసంలో కలిసి పూల మొక్కను అందజేసి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం టీజీని సన్మానించారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



ర్యాలీలో పాల్గొన్న డీఎంహెచ్‌వో శాంతికళ

కర్నూలు హాస్పిటల్, మే 16 (ఆంధ్రజ్యోతి): డెంగీ భయపట్టే వ్యాధి అని, పగటి పూట కుట్టడం ద్వారా సోకుతుందని, ఈ వ్యాధి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌వో పి.శాంతికళ అన్నారు. జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా నగరంలోని శ్రీరాంనగర్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో అవగాహన సదస్సు జరిగింది. అనంతరం ర్యాలీ నిర్వహించారు. డీఎంహెచ్‌వో మాట్లాడుతూ జిల్లాలో డెంగీ వ్యాధి నివారణకు అన్ని చర్యలు తీసుకున్నామన్నారు. ఈ వ్యాధిపై ప్రజల్లో చైతన్యం తీసుకువస్తున్నామన్నారు. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ప్రతి శుక్రవారం నిర్వహించే డ్రైడే- ఫ్రైడే కార్యక్రమాన్ని ప్రజలు పాటించి ఇంట్లో ఉన్న నీటి నిల్వలు లేకుండా చేయాలన్నారు. కార్యక్రమంలో డీపీఎంవో ఉమా, వైద్యాధికారి రాజానందిని, డిప్యూటీ డెమో చంద్రశేఖర్ రెడ్డి, హెల్త్ ఎడ్యుకేటర్ పద్మావతి ఉన్నారు.

పట్టణంలో అవగాహన ర్యాలీ

కోడుమూరు రూరల్: దోమల పట్ల అప్రమత్తంగా మెలగడం ద్వారానే డెంగీ నివారణ సాధ్యమని డాక్టర్ మదన్‌శేఖర్ అన్నారు. జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా వైద్యసిబ్బంది శుక్రవారం పట్టణంలో అవగాహన ర్యాలీ చేపట్టారు. కోడుమూరు గ్రామపంచాయతీ నుంచి కోట్ల సర్కిల్, పాత బస్టాండ్ కొత్తబస్టాండ్ మీదుగా ఎంపీడీవో కార్యాలయం వరకు ర్యాలీ కొనసాగించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ ఏడిస్ ఈజిప్ట్ దోమ పగటిసమయంలో కుట్టడం ద్వారా తీవ్రజ్వరం, తలనొప్పి, దద్దుర్లు, వాంతులు వంటి అనారోగ్య లక్షణాలు ఉంటాయని తెలిపారు. ప్రభుత్వాసుపత్రిలో చికిత్స తీసుకోవాలని సూచించారు. నిల్వనీరు లేకుండా పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని, ఫ్రైడే డ్రైడే పాటించాలని కోరారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, వైద్యసిబ్బంది నరసప్ప, కమాల్‌సాహెబ్ పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి

కర్నూలు కలెక్టరేట్, మే 16 (ఆంధ్రజ్యోతి): జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలని మీసాల రామస్వామి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ ఎదుట జర్నలిస్టులు నిరసన అనంతరం కలెక్టరేట్‌లో ఏవో విజయశ్రీకి వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ వర్కింగ్ జర్నలిస్టు మరణిస్తే రూ25 లక్షలు ఎక్స్‌గ్రేషియా ప్రభుత్వం ప్రకటించాలన్నారు. ఏబీఎన్-ఆంధ్రజ్యోతి కెమెరామెన్ సురేంద్రబాబు కుటుంబాన్ని ఏపీ సీఎం చంద్రబాబు పరామర్శించాలని కోరారు. జర్నలిజంలో 15 ఏళ్లకు పైగా పని చేస్తున్న వారికి పింఛన్ ఇవ్వాలని, హెల్త్ కార్డులు అన్ని ప్రైవేటు హాస్పిటల్స్‌కు వర్తింపునకు చర్యలు తీసుకోవాలన్నారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలివ్వాలని, ప్రెస్ క్లబ్ నిర్మాణం చేపట్టాలన్నారు. అలాగే రైల్వే పాసులను పునరుద్ధరించాలన్నారు. కార్యక్రమంలో జర్నలిస్టులు రంగా, రవి, శ్రీను, వల్లి, రఫీక్, సురేష్ పాల్గొన్నారు.

ప్రాజెక్టులకు నిధులను కేటాయించాలి

కర్నూలు న్యూసిటీ, మే 16(ఆంధ్రజ్యోతి): కరువు పీడిత ప్రాంతమైన కర్నూలు జిల్లాలో నీటిపారుదల ప్రాజెక్టుల నిర్మాణానికి అవసరమైన నిధులను కేటాయించాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి జి.రామక్రిష్ణ డిమాండ్ చేశారు. జిల్లా పర్యటనకు వస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జిల్లాలో శ్వాతంగా కరువును నిర్మూలించే విధంగా చర్యలు చేపట్టేందుకు కృషి చేయాలన్నారు. ముచ్చుమర్రి నుంచి ఎత్తిపోతల పథకము ద్వారా ఓర్వకల్లు పారిశ్రామిక హబ్ కొరకు పైపులైన్‌లో భూములను కోల్పోతున్న రైతులకు న్యాయమైన నష్టపరిహరం ఇవ్వాలన్నారు.

● రజకులకు ఎస్సీఎస్టీ తరహాలో సామాజిక రక్షణ చట్టం ఏర్పాటు చేయాలని ఏపీ రజక వృత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి సి.గురుశేఖర్ ఒక ప్రకటనలో కోరారు. జిల్లా పర్యటనకు వస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బహిరంగసభలో రజకవృత్తిదారుల సమస్యలను ప్రస్తావించాలని విజ్ఞప్తి చేశారు.

● మున్సిపల్ కార్మికుల సమస్యలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పరిష్కరించాలని కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ డ్వాక్రా గ్రూప్ మహిళా శానిటేషన్ కార్మికుల యూనియన్ జిల్లా అధ్యక్షుడు వైవి.రమణ కోరారు. ఈ మేరకు మున్సిపల్ కార్మికుల సమస్యలకు సంబంధించి ఓ లేఖను సీఎం కార్యాలయానికి పంపించారు.

దేవాలయ భూములను రక్షించండి

సి. బెళగల్, మే 16 (ఆంధ్రజ్యోతి): దేవాలయ భూములను రక్షించాలని కోడుమూరు బీజేపీ సీనియర్ నాయకుడు గోపాల్ డిమండ్ చేశారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ కోడుమూరు నియోజకవర్గంలో దేవాలయ భూములు ఎక్కడ ఉన్నాయని దేవాదాయ శాఖ అధికారులకే తెలియడం లేదన్నారు. గూడురు, కోడుమూరు, కర్నూల్ మండలలాలో కొందరు బడానాయకులు దేవాలయ మాన్యం భూములను పట్టాదారుల పాసుబుక్‌లను తమ పేర్లమీద చేసుకుని దర్జాగా అనుభవిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. బ్రాహ్మణదొడ్డి, పోలకల్లు, సిబెళగల్, బురాన్‌దొడ్డి, గూడూరు, కర్నూలు, కోడుమూరు గ్రామాల్లో పూజార్ల పరిస్థితి దయనీయ పరిస్థితిలో కొట్టుమిట్లాడుతున్నారన్నారు. మారబండమాదవస్వామి పేరుమీద దాదాపు 200 ఎకరాలు పైగా మాన్యం భూమి ఉండగా రెవెన్యూ రికార్డులో ఉండగా ఆభూమి కూడా కొందరు కబ్జా చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. అలయాల భూములను అధికారులు రక్షించకుంటే ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తామని హెచ్చరించారు. సమావేశలో బీజేపీ మండల నాయకుడు ఉశేని, దేవన్న, రాముడు, లింగన్న, వెంకటేశ్వర్లు, దస్తగిరి తదితరులు ఉన్నారు.

పాణ్యం ఎమ్మెల్యే ఆధ్వర్యంలో తిరంగ యాత్ర



ర్యాలీ చేస్తున్న ఎమ్మెల్యే, నాయకులు, కార్యకర్తలు

కల్లూరు, మే 16(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్ విజయవంతంగా పూర్తైన నేపథ్యంలో భారత త్రివిధ దళాలకు సంఘీభావంగా పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరిత ఆధ్వర్యంలో తిరంగ యాత్ర చేపట్టారు. శుక్రవారం మాదవీనగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి అమ్మా హస్పిటల్ సెంటర్ వరకు జాతీయ జెండాలు చేతబట్టి ర్యాలీ నిర్వహించారు. ఉమ్మడి కూటమి నాయకులు హాజరై తిరంగ యాత్రలో పాల్గొన్నారు. నంద్యాల జిల్లా టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్, కె.పార్వతమ్మ, పెరుగు పురుషోత్తంరెడ్డి, ప్రభాకర్‌యాదవ్, బ్రాహ్మణపల్లె నాగిరెడ్డి, డి.రాయాంజనేయులు, రాంబాబు, గంగాధర్‌గౌడ్, శ్రీనివాసరావు, మునిస్వామి టీడీపీ కూటమి నాయకులు పాల్గొన్నారు.

వేసవిలో తరగతులు నిర్వహిస్తే చర్యలు

● జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్ పాల్

కర్నూలు ఎడ్యుకేషన్, మే 16 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలు వేసవి సెలవుల్లో తరగతులు నిర్వహిస్తే చర్యలు తప్పవని జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్ పాల్ శుక్రవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలో పని చేసే ఉపాధ్యాయులను అడ్మిషన్ల కోసం క్యాంపెయిన్ నిర్వహిస్తున్నట్లు విద్యార్థి ఉపాధ్యాయ సంఘాల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయని తెలిపారు. అలాగే పాఠశాలల ఫ్లెక్సీలు ఇష్టానుసారంగా ఏర్పాటు చేస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 22 శాతం ప్రైవేటు పాఠశాలలు ఆన్‌లైన్‌లో మార్కులు నమోదు చేయలేదన్నారు. ఫారం-1 అప్‌లోడు చేయలేదని, 17వ తేదీ సాయంత్రం 5 గంటలలపు ఆన్‌లైన్‌లో మార్కుల నమోదు చేయాలని ఆదేశించారు. మండల విద్యాశాఖ అధికారులు, డివిజనల్ ఉప విద్యాధికారులు సందర్శించిన సమయంలో అడిగిన సమాచారాన్ని వెంటనే అందించాలన్నారు. ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తే ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నీటి గుంతల నిర్మాణాలను వేగవంతం చేయాలి

సి.బెళగల్, మే 16 (ఆంధ్రజ్యోతి): నీటి గుంతల నిర్మాణాలను వేగవంతం చేయాలని ఏపీవో రామన్న ఉపాధి సిబ్బందికి సూచించారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఈసీ రంగస్వామి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఉపాధి సిబ్బందితో మాట్లాడుతూ జాబుకార్డు ఉన్న ఉపాధి కూలీలు బ్యాంక్ ఖాతాకు ఆధార్ నంబరు తప్పనిసరి లింక్ చేసుకోవాలని ఏపీవో రామన్న తెలిపారు. వేసవిని దృష్టిలో పెట్టుకుని పాడిపశువులకు తాగునీరు అందుబాటులో ఉండేలా నీటి తొట్లను నిర్మాచించడానికి సిద్ధం చేయాలన్నారు. పురాతనమైన బావులు పూడిక తీయించాలని కార్యదర్శులకు సూచించారు.

ఎంపీటీసీల గౌరవ వేతనం విడుదల చేయాలి

ఓర్వకల్లు, మే 16 (ఆంధ్రజ్యోతి): ఎంపీటీసీల గౌరవ వేతనం వెంటనే విడుదల చేయాలని ఎంపీపీ తిప్పన్న అన్నారు. శుక్రవారం ఓర్వకల్లులోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ తిప్పన్న ఆధ్వర్యంలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపీపీ తిప్పన్న, ఉపాధ్యక్షులు పద్మనాభరెడ్డి మాట్లాడుతూ ఎంపీటీసీలకు 16 నెలల నుంచి గౌరవ వేతనం అందలేదని, వెంటనే పెండింగ్‌లో ఉన్న వేతనాలు తక్షణమే అందేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఎంపీటీసీలు సోమశేఖర్ రెడ్డి, పుల్లయ్య, లక్ష్మీదేవి, నాగిరెడ్డి పాల్గొన్నారు.

నేడు గాడిచర్ల మనుమడు మోహనకృష్ణ రాక

కర్నూలు కల్చరల్, మే 16 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, మహాత్మాగాంధీ అనుచరుడు గాడిచర్ల హరిసర్వోత్తమ రావు మనుమడు ఎన్‌సీ మోహనకృష్ణ శనివారం ఉదయం 8 గంటలకు కర్నూలు విచ్చేస్తున్నట్లు జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కె. ప్రకాశ్ ఒక ప్రకటనలో తెలిపారు. కర్నూలులో గాడచర్ల ఫౌండేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు కేసీ కల్కూర మనుమరాలి వివాహ వేడుకకు హాజరవుతున్న ఆయన జిల్లా గ్రంథాలయ సంస్థను సందర్శించి, జిల్లా కేంద్ర గ్రంథాలయం ఆవరణలో గాడిచర్ల విగ్రహానికి పూలదండలు వేసి నివాళులర్పిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కేసీ కల్కూరతోపాటూ కుప్ప విశ్వవిద్యాలయం ఆచార్యులు డాక్టర్ దొరైస్వామి, ప్రముఖ విద్యావేత్తలు డాక్టర్ రావి శారద, సతీష్‌శర్మ, డాక్టర్ సురేంద్ర, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొంటారని కె. ప్రకాశ్ తెలిపారు.

మార్కెట్ వెలవెల.. కూలీలు విలవిల

● ఆదోని మార్కెట్ యార్డులో నిలిచిన వ్యవసాయ ఉత్పత్తులు ● ఉపాధి లేక కూలీలు, హమాలీల అవస్థలు





నిర్మానుష్యంగా పత్తి ప్లాట్‌ఫాం, ఇన్‌సెట్‌లో వెలవెలపోతున్న యార్డు

ఆదోని అగ్రికల్చర్, మే16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోనే రెండో స్థానంగా పేరున్న ఆదోని మార్కెట్ యార్డు పేరొందింది. పంట దిగుబడుల వ్యాపారంలో పత్తి, అముదాలు, వేరుశనగ, పూల విత్తనాలతో పాటు శనగలు, కందులు సుమారు రూ.1500-1800కోట్ల వ్యాపారం సాగుతుంది. దీంతో యార్డులో సరాసరి మూడు వేల మంది దాకా హమాలీలు జీవనం సాగిస్తున్నారు. మే నెలలో వ్యవసాయ దిగుబడులు రాకపోవడంతో కూలీలు, హమాలీలకు పనులు లేవు. దీంతో కూలీలు, హమాలీలు వలసబాట పడుతున్నారు. ఇంతకాలం పనులు లేక రైతులు, మధ్య, దిగువ తరగతి కుటుంబాలు వలసబాట పట్టేవారు. ప్రస్తుతం ఈ సెగ మార్కెట్ యార్డ్‌కి తాకింది.

సరుకును బట్టి కూలీ

కూలీలు, హమాలీలకు మార్కెట్ కమిటీకి వచ్చే సరుకును బట్టి కూలి దక్కుతుంది. సరాసరి రూ.800ల వరకు గిట్టుబాటయ్యేది. ప్రస్తుతం రూ.100లు కూడా రావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోజుకు 500-1000క్వింటాళ్లకు మించి సరకు రావడం లేదు. తాము ఎలా బతకాలని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రెండు నెలలుగా పనులు లేవు



సీజన్ ముగియడంతో రెండు నెలల నుంచి మార్కెట్ యార్డ్‌కు పంట ఉత్పత్తులు తగ్గాయి. దీంతో పనులు లేవు. రోజు గ్రామాల నుం చి పనికి వచ్చి నిరాశతో ఇంటికి వెళుతున్నాం. రోజుకు కనీసం రూ. వంద కూడా రావడం లేదు. - నగేష్, హమాలి

వలస వెళ్తా



సీజన్‌లో రోజుకు రూ.800ల నుం చి 1,200ల వరకు సంపాదించాం. రోజులు ఉన్నాయి. రెండు నెలల నుంచి రోజుకు రూ.వంద కూడా రావడం లేదు. దారి ఖర్చులకే సరిపోతుంది. ఖరీఫ్ దిగుబడులు మూడు నెలల వరకు రావు. తప్పని పరిస్థితిలో బెంగళూరుకు వలస వెళ్తా. - శేఖర్, హమాలి

వీధి కుక్కలకు శస్త్ర చికిత్సలు

ఆదోని టౌన్, మే16 (ఆంధ్రజ్యోతి): వీధి కుక్కల సంఖ్య నియంత్రించడానికి సంతానోత్పత్తి జరగకుండా శస్త్ర చికిత్స చేయనున్నట్లు మున్సిపల్ కమిషనర్ కృష్ణ శుక్రవారం తెలిపారు. అనిమల్ బర్త్ కంట్రోల్ ప్రోగ్రాం 2025 కింద 17వ తారీకు నుంచి రాంజల పంప్ హౌస్ సమీపంలోని మున్సిపల్ సెంటర్‌లో శస్త్ర చికిత్సలను ప్రారంభిస్తామని తెలిపారు. వీధి కుక్కల సంఖ్య పెరిగకుండా శస్రతచికిత్సకు సహకరించాలని ఆయన కోరారు.

విద్యార్థినికి ఎమ్మెల్యే అభినందన



లాస్యరెడ్డికి ల్యాప్‌టాప్ బహూకరిస్తున్న ఎమ్మెల్యే శ్యాంబాబు

పత్తికొండ, మే 16 (ఆంధ్రజ్యోతి): సీబీఎస్‌ఈ పదో తరగతి ఫలితాల్లో విద్యార్థిని రాష్ట్రస్థాయి ప్రథమ స్థానం సాధించిన విద్యార్థిని లాస్యరెడ్డిని ఎమ్మెల్యే శాంబాబు అభినందించారు. శుక్రవారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో విద్యార్థిని లాస్యరెడ్డిని ఎమ్మెల్యే సన్మానించి, లాప్‌టాప్ బహుకరించారు. వెనుకబడ్డ పత్తికొండ ప్రాంతంలో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించడం సంతోషకరమన్నారు. ఇక్కడి ప్రాంత విద్యార్థులు ఉద్యోగ అవకాశాల్లో ఉన్నత స్థానంలో నిలవాలని ఆకాంక్షించారు. విద్యార్థులకు తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని భోరసానిచ్చారు. సాంబశివారెడ్డి ఉన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న గిరిమల్లేష్ గౌడ్

ఆలూరు, మే16(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారమే టీడీపీ ప్రభుత్వ ధ్యేయమని ఆ పార్టీ నాయకుడు గిరి మల్లేష్‌గౌడ్ అన్నారు. శుక్రవారం టీడీపీ ఇన్‌చార్జి వీరభద్రగౌడ్ సూచనల మేరకు పార్టీ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వినతులను టీడీపీ ఇన్‌చార్జి వీరభద్రగౌడ్ పరిశీలించి పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులకు తెలియజేస్తారని తెలిపారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ సారథ్యంలో ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తున్నారన్నారు. త్వరలోనే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, తల్లికి వందనం అమలు అవుతాయన్నారు. కార్యక్రమంలో ఏబీసీ డీసీ చైర్మన్ నగరడోణ కిష్టప్ప, మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ రామ్‌నాథ్‌యాదవ్, మండల కన్వీనర్ అశోక్‌యాదవ్, టీడీపీ నాయకులు తిమ్మయ్య, రాముడు, రాముయాదవ్, గుండయ్య, హనుమప్ప, వీరేష్ పాల్గొన్నారు.

రక్తహీనతపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న అధికారులు

వెల్దుర్తి, మే 16 (ఆంధ్రజ్యోతి): మండలంలో కొసనపల్లి గ్రామం అంగన్వాడీ కేంద్రంలో శుక్రవారం ఐసీడీఎస్ సీడీపీవో లూక్ కిశోరి వికాసం నిర్వహించారు. జిల్లా అధికారి శైలజకుమార్ రక్తహీనతపై బాలికలకు అవగాహన కల్పించారు. డాక్టర్ మల్లిఖార్జున యుక్తవయస్సులో వచ్చే మార్పులు, సమస్యలు తెలియజేశారు. జిల్లా ఫ్లోరిన్ అధికారి డాక్టర్ సుధాకర్ కలుషిత నీరు తాగడం వల్ల కలిగే అనర్థాలు, పరిసరాల పరిశుభ్రత వల్ల కలిగే ప్రయోజనాలు వివరించారు. సూపర్‌వైజర్ సరస్వతి మాట్లాడుతూ 18 సంవత్సరాలు దాటిన తరువాతనే అమ్మాయిలకు పెళ్లి ప్రయత్నాలు చేయాలన్నారు. బాల్యవివాహాలు చేసేవారి సమాచారాన్ని 1098 లేదా 100 నెంబర్‌కు తెలియజేయాలని, వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. ఏఎస్‌ఎం అన్నపూర్ణాదేవి, అంగన్వాడీలు సుమలత, నిర్మల, అనంతమ్మ, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

19న ఆలయ భూముల కౌలు వేలం

తుగ్గలి, మే 16 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 19న చెన్నకేశవస్వామి మాన్యం భూములను వేలం వేయనున్నట్లు ఈవో వీరయ్య తెలిపారు. శుక్రవారం మాట్లాడుతూ దేవదాయశాఖ ఆధ్వర్యంలో కౌలుకు మూడేళ్ల పాటు సాగు చేసుకోవడానికి ఉదయం 10 గంటలకు వేలం వేస్తామన్నారు. రూ.5వేలు డిపాజిట్ చేసి సర్వే.నెం. 767/1లో 6.42 ఎకరాలు, 767/2లో 1.54 ఎకరాలు, 801 సర్వేలో 8.57 ఎకరాలు, సర్వే నెం.13లో 20.72 ఎకరాలు, 578/2 సర్వే. నెంబరులో 27.02 ఎకరాలు భూములను వేలం వేస్తున్నామన్నారు. దక్కించుకున్నవారు మొత్తాన్ని వెంటనే చెల్లించాలన్నారు.

పరిశుభ్రత పాటించాలి

● ఆస్పరిలో డెంగీ నివారణ ర్యాలీ



ఆస్పరిలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ఆస్పరి, మే16 (ఆంధ్రజ్యోతి): ప్రజలు తమ ఇంటి పరిసరాల్లో పరిశుభ్రత పాటించాలని వైద్యాధికారులు రఘురాం రెడ్డి, దుర్గాబాయి సూచించారు. శుక్రవారం ఆస్పరిలో జాతీయ డెంగీ నివారణ దినం సందర్భంగా పీహెచ్‌సీ నుంచి అంబేడ్కర్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించి, దోమల నివారణపై నినాదాలు చేశారు. అనంతరం జిల్లా అధికారి లక్ష్మణ్ నాయక్, మలేరియా అధికారి నూకరాజు మాట్లాడుతూ డెంగీ దోమకాటుతో వస్తుదని, ప్రతి శుక్రవారం డ్రైడే పాటించి, పారిశుధ్య పనులు నిర్వహించాలని సూచించారు.రాత్రి వేళల్లో దోమతెరలు తప్పనిసరిగా వాడాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో గీతా వాణి, బాలకృష్ణారెడ్డి, ఆశ వర్కరులు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

డెంగీని ఓడించండి



పత్తికొండలో ప్రతిజ్ఞ చేస్తున్న ఆరోగ్య సిబ్బంది

పత్తికొండ, మే 16 (ఆంధ్రజ్యోతి): మూడు పద్ధతులను పాటించి డెంగీని ఓడించాలని వైద్యాధికారి సుజాత పిలుపునిచ్చారు. జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా శుక్రవారం పత్తికొండలో ఆరోగ్యసిబ్బందితో ర్యాలీ నిర్వహిం చారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా పరిశు భ్రత పాటించాలని సూచించారు. కార్యక్రమంలో పబ్లిక్ హెల్త్ నర్స్ ఎం.గంగరత్నమ్మ, ఆరోగ్య పర్యవేక్షకురాలు వరలక్ష్మి, ప్రకాశరావు, హెల్త్ అసిస్టెంట్ హనుమంతరెడ్డి, చాముండేశ్వరి, చైతన్య, శ్రీకళ, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

దోమల సంతతిని నివారించాలి



మద్దికెరలో ప్రతిజ్ఞ చేస్తున్న వైద్యసిబ్బంది

మద్దికెర, మే 16 (ఆంధ్రజ్యోతి): దోమల సంతతి నివారించడానికి ప్రజలు కృషిచేయాలని ప్రభుత్వ వైద్యాధికారులు శ్రీలక్ష్మి, రాగిణి సూచించారు. జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా శుక్రవారం మద్దికెరలో ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. ప్రజలు దోమల నుంచి రక్షణ కోసం దోమతెరలు వాడాలని, పొడవాటి దుస్తులు ధరించాలన్నారు. దోమలను చంపే క్రీములను, స్ప్రేలను వాడాలన్నారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉంటే దోమల సంతతి పెరుగుతుందని కిరోసిన్, ఇంజిన్ ఆయిల్ చల్లాలన్నారు. ట్యాంకులకు మూతలు అమర్చాలని, లేకుంటే దోమలు గుడ్లు పెట్టి వాటి సంతానం పెరుగుతందన్నారు. డెంగీ ప్రభలకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ అక్బర్ బాషా, సీహెచ్‌వో నిరంజన్ బాబు, తదితరులు ఉన్నారు.

ప్రజలు అభివృద్ధిని కోరుకుంటారు



మాజీ ఎమ్మెల్సీ చంద్రశేఖర్ రెడ్డి

ఆదోని టౌన్, మే16 (ఆంధ్రజ్యోతి): ప్రజలు అభివృద్ధిని కోరుకుంటారని, గత ప్రభుత్వ హయాంలో అది కుంటుపడిందని మాజీ ఎమ్మెల్సీ చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. శుక్రవారం మాట్లాడుతూ, గ్రామాలను పట్టించుకోకపోవడంతో, కనీసం తాగునీరు కూడా అందక ఇబ్బందులు పడ్డారని విమర్శించారు. విద్యుత్ కోతలు అధికమై, ప్రజలు అవస్థలు పడుతున్నారని, ప్రభుత్వ కార్యాలయాలల్లో అవినీతి పెరిగిందని ఆరోపించారు. చింతకుంట నుంచి ఆదోని మీదుగా చేస్తున్న నేషనల్ హైవే పనులు ఎనిమిదేళ్లుగా నత్తనడకన సాగుతున్నాయని, వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం మారినా టిట్కో గృహాలను లబ్ధిదారులకు పంపిణీ చేయకపోవడం విచారకరమని, వెంటనే ఇవ్వాలని కోరారు.

గృహ నిర్మాణాలు వేంగా పూర్తిచేయాలి

మద్దికెర, మే 16 (ఆంధ్రజ్యోతి): లబ్ధిదారులు గృహ నిర్మాణాలను వేంగా పూర్తిచేయాలని ఏఈ ఉమాకాంత్, పంచాయతీరాజ్ ఏఈ విష్ణు కోరారు. శనివారం మద్దికెరలోని కాలనీల్లో నూతన గృహాలను పరిశీలించారు. బీఎల్, ఎల్‌ఎల్, ఆర్‌ఎల్ స్టేజీలో ఉన్న వాటని వెంటనే పూర్తి చేసుకోవాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీసీలకు రూ.2.30 లక్షల నుంచి రూ.2.50లక్షల వరకు ఇస్తున్నట్లు తెలిపారు.

అర్ధరాత్రి ఇంటికి నిప్పు



బాధితులు శాంతరాజు కుటుంబం

ఆదోని, మే16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అరుణ్ జ్యోతి నగర్‌లోని తన ఇంటికి కిరణ అనే వ్యక్తి గురువారం అర్ధరాత్రి పెట్రోల్ పోసి అంటించినట్లు బాధితుడు శాంతిరాజు ఆరోపించారు. బాధితుడి కథనం మేరకు.. కుటుంబ సభ్యులతో కలిసి నిద్రపోతున్న సమయంలో ఇంటి నుంచి పొగరావడంతో బయటికి పరుగులు తీశారు. అప్పటికే ఇంట్లోని వాషింగ్ మిషన్, కూలర్, గ్రైండర్ తోపాటు వంట సామాన్లు, బట్టలు దహనమయ్యాయి. రెండేళ్లుగా ఎదురింటి కిరణ్ అనే వ్యక్తితే గొడవ పడుతుండేవాడు. అది మనసులో పెట్టుకొని అర్ధరాత్రి పెట్రోల్ పోసి అంటించారన్నారు. రూ.5లక్షల ఆస్తి నష్టం సంభవించిందని తెలిపారు. ఈమేరకు మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌ఓ ఫిర్యాదు చేశానని, పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేసున్నట్లు తెలిపారు.

హెచ్‌ఎంలుగా పదోన్నతి కల్పించాలి



మాట్లాడుతున్న కార్యదర్శి భీమరాజు

ఆదోని అగ్రికల్చర్, మే16 (ఆంధ్రజ్యోతి): సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎంలుగా పదోన్నతి కల్పించాలని ఎస్టీయూ మాజీ కౌన్సిలర్ లోక్యనాయక్ డిమాండ్ చేశారు. శుక్రవారం మున్సిపల్ ఉన్నత పాఠశాలలో వీరచంద్ర యాదవ్ అధ్యక్షతన సమావేశంనిర్వహించారు. ఉపాధ్యాయ బదిలీలను వెబ్ కౌన్సెలింగ్ ద్వారా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయిం చిందన్నారు. వేల ఆప్షన్లు ఉండడం వల్ల సమీపం ప్రాంతాలను ఎంపిక చేసుకోవడం కష్టంగా ఉంటుందన్నారు. బదిలీలను మాన్యువల్ కౌన్సెలింగ్ విధానంలో నిర్వహించాలన్నారు. నాగరాజు, ప్రహల్లాద, భీమరాజు, మారయ్య పాల్గొన్నారు.

మార్కులు తక్కువ వచ్చాయని ఆత్మహత్య



కరిష్మా బీ(ఫైల్)

వెల్దుర్తి, మే 16(ఆంధ్రజ్యోతి): ఇటీవల విడుదలైన పదో తరగతి పరీక్షల్లో మార్కులు తక్కువగా వచ్చాయని బాలిక ఆత్మహత్య చేసుకుంది. మండలంలోని రామళ్లకోట గ్రామానికి చెందిన సయ్యద్ ఇద్రుస్ బాషాకు ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. రెండో కూతురు కరిష్మా బీ(15) రామళ్లకోట జడ్పీ ఉన్నత పాఠశాలలో ఇటీవల పదో తరగతి పూర్తిచేసింది. ఫలితాల్లో 361 మార్కులు రావడంతో తక్కువ మార్కులు వచ్చాయని తల్లిదండ్రుల వద్ద బాధపడేది. కాగా శుక్రవారం తల్లిదండ్రులు పొలం పనికి వెళ్లారు. ఇంట్లో కరీష్మాబీ, చెల్లెలు, మాత్రమే ఉన్నారు. బాలిక వంటగదిలో పైకప్పు ఊయల కొక్కానికి చున్నీతో ఉరి వేసుకుంది. గమనించిన చెల్లెలు కాలనీవాసులకు తెలపడంతో తల్లిదండ్రులకు సమాచారం, ఇచ్చి, వెల్దుర్తి సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. తండ్రి సయ్యద్ ఇద్రుస్‌బాషా ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. పోస్టుమార్టం అనంతరం భౌతికకాయాన్ని కుటుంబసభ్యులకు అందించారు.

క్షయను నయం చేయొచ్చు

ఆదోని టౌన్, మే16 (ఆంధ్రజ్యోతి): క్షయను ముందుగానే గుర్తించి సరైన మందులను వాడితే నయం చేయవచ్చని ఉందని డిప్యూటీ డీఎంహెచ్‌వో డా.సత్యవతి అన్నారు. శుక్రవారం ఏరియా ఆసుపత్రి ఆవరణలో 20 మంది క్షయ బాధితులకు దాతలు అందించిన పౌష్టికాహార కిట్లను పంపిణీ చేశారు. క్షయ నిర్మూలణకు కేంద్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలను అమలు చేస్తుందన్నారు. ఎంపీహెచ్‌ఎస్ బాబు రాజు, జిల్లా కో ఆర్డినేటర్ ఉమాపతి మాట్లాడుతూ, వ్యాధిగ్రస్తులకు దాతల సహకారంతో పౌష్టిరకాహారం, కేంద్ర ప్రభుత్వం ఉచిత మందులలు ఇస్తుదని చికిత్స పొందుతున్న సమయంలో కార్మికులకు నెలకు రూ.వెయ్యి చొప్పున ఆరు నెలల పాటు ఇస్తారన్నారు. దాతలు నిరంజన్, ఫయాజ్, సిబ్బంది వీరేష్, సుబ్బమ్మ బాయి, పద్మావతమ్మ పాల్గొన్నారు.

టీడీపీ రైతులది



మనోహర్ చౌదరి

తుగ్గలి, మే 16 (ఆంధ్రజ్యోతి): తెలుగు దేశం పార్టీ రైతుల పార్టీ అని తెలుగు రైతు సంఘం ఉపాధ్యక్షుడు మనోహర్ చౌదరి అన్నారు. శుక్రవారం రాతన గ్రామంలో మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వచ్చాక, రైతులకు సంక్షేమ పథకాలు అందించిందన్నారు. సీఎం చంద్రబాబు నాణ్యమైన విత్తనాలు అందిస్తారన్నారు. రాబోవు రోజుల్లో పత్తికొండ ప్రాంతంలో ఎమ్మెల్యే శ్యాంబాబు సహకారంతో జ్యూస్ ఫ్యాక్టరీ కూడా నిర్మిస్తారన్నారు.

నేటి నుంచి వేడుకలు

దేవనకొండ, మే 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నేలతలమర్రి గ్రామంలో నూతనంగా నిర్మించిన అంజనేయస్వామి ఆలయ ప్రారంభ వేడుకలు నేటి నుంచి మూడు రోజులు నిర్వహించనున్నారు. ఆలయ జీర్ణోధరణ పూజలు, విగ్రహ ప్రతిష్ట, శిఖర కలశ ప్రతిష్ట, ధ్వజస్థంభ ప్రతిష్ట, ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

టీజీ వెంకటేష్ జన్మదిన వేడుకలు



భోజనాలు వడ్డిస్తున్న టీజీ వెంకటేష్ అభిమానులు

ఆదోని అగ్రికల్చర్, మే16 (ఆంధ్రజ్యోతి): బీజేపీ నాయకుడు, రాజ్యసభ్య మాజీ సభ్యుడు టీజీ వెంకటేష్ జన్మదిన వేడుకలను శుక్ర వారం అభిమానులు ఆదోనిలో నిర్వహించారు. రాజరాజేశ్వరి నగర్‌లోని నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఆవాసియ అనాథ పిల్లల విద్యాలయంలో మోహన్‌బాబు అభిమాన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రంగనాయకులు, డాక్టర్ గంగాధర్, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ దేవి శెట్టి ప్రకాష్ కేక్‌కట్ చేసి విద్యార్థులకు పంచారు. ఆదోని వాసి టీజీ వ్యాపారవేత్తగా కర్నూలులో స్థిరపడి ప్రజల కోసం పార్టీలకతీతంగా సేవా కార్యక్రమాలు చేస్తున్నారన్నారు. అనంతరం విద్యార్థులకు భోజనం వడ్డించారు.

కూలిన విద్యుత్ స్తంభం



కూలిన స్తంభాన్ని చూపుతున్న బాధితులు

మద్దికెర, మే 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెరవలి గ్రామంలోని శుక్రవారం రాత్రి గాలి, వాన కురిసింది. బీసీ కాలనీలో విద్యుత్ స్తంభం ఇంటి ప్రహరీపై కూలింది. అయితే ఎవరికీ ఏమీ కాలేదు. గాలివాన వచ్చినప్పుడు ఈ స్తంభం తరచుగా ఊగుతుండేదని, మార్చాలని పలు మార్లు పంచాయతీ, విద్యుత్ అధికారులకు తెలిపినా పట్టించుకోదని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. స్తంభం కూలిపోవడంతో విద్యుత్ అధికారులు సరఫరా నిలిపివేశారు. పెరవలి, ఎం.అగ్రహారం గ్రామాల్లో రాత్రి విద్యుత్ అంతరాయం కలిగింది.

ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే చర్యలు



పంచాయతీ స్థలాలను పరిశీలిస్తున్న అధికారులు

మద్దికెర, మే 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే చర్యలు తప్పవని డిప్యూటీ ఎంపీడీవో శివకుమార్ హెచ్చరించారు. శుక్రవారం గ్రామంలోని వడ్డె వీదిలో పంచాయతీ స్థలాల ఆక్రమణలపై విచారణ చేశారు. పంచాయతీ స్థలాలు ఆక్రమణకు గురి కాకుండా కంచె వేశామని తెలిపారు. గ్రామంలో పారిశుధ్య వ్యవస్థపై ప్రత్యేక దృష్టి పెట్టామని, తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు మురళిధర్ రెడ్డి, పంచాయతీ సలహాదారుడు బండారు ఆంజనేయులు, పారా రాఘవేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

దేశద్రోహం కేసు నమోదు చేయాలి



నూర్ అహ్మద్

ఆదోని టౌన్, మే16 (ఆంధ్రజ్యోతి): దేశ సైనికులను కించపరిచేలా వ్యాఖ్యలు చేసిన మధ్యప్రదేశ్ మంత్రి అజయ్ షాపై దేశద్రోహం కేసు నమోదు చేయాలని మైనార్టీ పరిరక్షణ సమితి కార్యదర్శి నూర్ అహ్మద్ డిమాండ్ చేశారు. శుక్రవారం మాట్లాడుతూ, దేశ ప్రతిష్ఠను పెంచిన కల్నల్ సోఫియా ఖురేషిని ఉగ్రవాదుల సోదరిగా సంబోధించడం అతడి నీచ మనస్తత్వానికి నిదర్శనమని విమర్శించారు. ఇలా మాట్లాడేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

తలసీమియా బాధితులకు రక్తదానం



రక్తదానం చేస్తున్న గ్రామస్థులు

దేవనకొండ, మే 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో తలసీమియా బాధితుల కోసం ఏఆర్జీ సంస్థ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. వేసవిలో రక్తం దొరకక తలసీమియా బాధితులు అవస్థలు పడుతుండటంతో వారికోసం అక్షయ బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో దాదాపు 161 మంది రక్తం దానం చేశారు. ఏఆర్జీ సంస్థ నిర్వాహకులు వీరేష్, జగదీష్, సాయి, చిందబంర గౌడ్, విజయ్, తదితరులు పాల్గొన్నారు.

భయం భయంగా.!

● పెచ్చులూడుతున్న పైకప్పు
● ఆదోని వ్యవసాయ మార్కెట్ కార్యాలయం దుస్థితి



కడ్డీలు తేలి పెచ్చులూడుతున్న పైకప్పు

ఆదోని అగ్రికల్చర్, మే 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు కార్యాలయ పైకప్పు పెచ్చులూడుతోంది. దీంతో సిబ్బంది, రైతులు భయం భయంగా కాలం గడుపుతున్నారు. యార్డుకు రూ.కోట్లలో ఆదాయం ఉన్నా అధికారులు భవనానికి మరమతులు చేయించడం లేదు. ఏళ్లకిందట నిర్మించినవి కావడంతో పైకప్పు పెచ్చులూడుతున్నాయి, ఇనుప రాడ్లు తేలాయి. ఎప్పుడు ఎవరి తల మీదపై పడుతుతుందోనని సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. ప్రమాదం జరగక మునుపే అధికారులు మరమ్మతులు చేయాలని సిబ్బంది, రైతులు కోరుతున్నారు.

ప్రజలకు శుద్ధి చేసిన నీటిని అందించాలి

● మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి



ఫిల్టర్ బెడ్‌ను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి

ఎమ్మిగనూరు టౌన్, మే 16 (ఆంధ్రజ్యోతి) : పట్టణ ప్రజలకు శుద్ధి చేసిన తాగు నీటిని అందించాలని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి సూచించారు. శుక్రవారం పట్టణ శివారులోని గుడికల్ రోడ్డులో ఉండే వాటర్ పంప్ హౌస్‌ను ఆకస్మిక తనిఖీచేశారు. వేసవిలో పట్టణ ప్రజలకు నీటి సమస్య రాకుండా చూస్తున్నామన్నారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ చెరువు నుంచి వచ్చే నీటిని క్యారి ఫ్లకులేటర్‌లో నిల్వ చేసి ఫిల్టర్ బెడ్‌కు తరలించి నీటిని శుద్ధిచేసి పంపించే తీరును పరిశీలించారు. క్యారి ఫ్లకులేటర్‌ను, ఫిల్టర్ బెడ్‌ను శుభ్రంగా ఉంచాలని నీటిని శుద్ధి చేశాకే ప్రజలకు సరఫరా చేయాలని సిబ్బందికి సూచించారు.

ఉపాధ్యాయుల సమస్యలపై ఉద్యమ కార్యచరణ



వెంకటేశ్వర్లు

ఎమ్మిగనూరు టౌన్, మే 16 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ సమస్యలను, బదిలీలను వెంటనే పరిష్కరించాలని విద్యా కమిషనర్‌ను ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం స్థానిక ఎస్టీయూ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ గుర్తింపు పొందిన ఉపాధ్యాయ సంఘాలతో విద్యా కమిషనర్ 30 సమావేశాలు నిర్వహించినప్పటికీ తమ సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. డిమాండ్ల పరిష్కారం కోరుతూ ఉపాధ్యాయ సంఘా ద్వారా ఉద్యమ కార్యాచరణ సిద్ధం చేసినట్లు తెలిపారు. ఉపాధ్యాయులందరూ కార్యాచరణకు సిద్ధమవ్వాలని పిలుపునిచ్చారు.

రవీంద్రభారతిలో గద్వాల సోమన్న పుస్తకావిష్కరణ



రవీంద్రభారతిలో పుస్తకావిష్కరణ చేస్తున్న దృశ్యం

పెద్దకడుబూరు , మే 16(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కంబదహాల్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న ప్రముఖ బాలసాహిత్యవేత్త, బాలబంధు గద్వాల సోమన్న రచించిన 70వ పుస్తకాన్ని హైదరాబాదులోని రవీంద్ర భారతిలో శుక్రవారం ఆవిష్కరించారు. ఈయన రచించిన 'సప్తతి' పుస్తకాన్ని ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు, శతాధిక పుస్తకాల ప్రచురణ కర్త వైరాగ్యం ప్రభాకర్, తెలంగాణ సాహిత్య అకాడమి కార్యదర్శి డాక్టర్. నామోజు బాలాచారి, గోవర్ధనరాజు చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ పుస్తకాన్ని కే.వీ నాగేశ్వరయ్యకు అంకితం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కవులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మార్కులు తక్కువ వచ్చాయని ఆత్మహత్య



కరిష్మా బీ(ఫైల్)

వెల్దుర్తి, మే 16(ఆంధ్రజ్యోతి): ఇటీవల విడుదలైన పదో తరగతి పరీక్షల్లో మార్కులు తక్కువగా వచ్చాయని బాలిక ఆత్మహత్య చేసుకుంది. మండలంలోని రామళ్లకోట గ్రామానికి చెందిన సయ్యద్ ఇద్రుస్ బాషాకు ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. రెండో కూతురు కరిష్మా బీ(15) రామళ్లకోట జడ్పీ ఉన్నత పాఠశాలలో ఇటీవల పదో తరగతి పూర్తిచేసింది. ఫలితాల్లో 361 మార్కులు రావడంతో తక్కువ మార్కులు వచ్చాయని తల్లిదండ్రుల వద్ద బాధపడేది. కాగా శుక్రవారం తల్లిదండ్రులు పొలం పనికి వెళ్లారు. ఇంట్లో కరిష్మాబీ, చెల్లెలు, మాత్రమే ఉన్నారు. బాలిక వంటగదిలో పైకప్పు ఊయల కొక్కానికి చున్నీతో ఉరి వేసుకుంది. గమనించిన చెల్లెలు కాలనీవాసులకు తెలపడంతో తల్లిదండ్రులకు సమాచారం, ఇచ్చి, వెల్దుర్తి సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. తండ్రి సయ్యద్ ఇద్రుస్‌బాషా ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. పోస్టుమార్టం అనంతరం భౌతికకాయాన్ని కుటుంబసభ్యులకు అందించారు.

వక్ఫ్‌బోర్డు భూములపై వివాదం



విలేకరులతో మాట్లాడుతున్న వగరూరు గ్రామస్థులు

మంత్రాలయం, మే 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వగరూరు గ్రామానికి చెందిన వక్ఫ్‌బోర్డు భూములపై ఇరువర్గాల మధ్య వివాదం రేగడంతో బాధితులు మాధవరం పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించారు. చౌలహల్లి గ్రామానికి చెందిన వక్ఫ్ భూమిని అల్లాబకాష్, బాషు మరో 14 మంది నాలుగేళ్ల నుంచి సాగు చేసుకుంటున్నారు.అదే గ్రామానికి చెందిన మల్లేష్, రామాంజిని, సోమేష్, రాముడు, కటిక మహబూబ్ బాషా, ఇమాం వలి వీరిని అడ్డుకుని తాము సాగు చేసుకుంటామన్నారు. దీంతో బాధితులు అల్లాబకాష్, బాషు మాధవరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై ఎస్ఐ విజయకుమార్‌ను కోరగా.. ఇరువర్గాలను పిలిపించి రికార్డులు పరిశీలించి భూవివాదాన్ని పరిష్కరిస్తామని తెలిపారు.

రోడ్డున పడ్డ చిరు వ్యాపారులు

● దుకాణాలను బలవంతంగా ఖాళీ చేయించిన అధికారులు ● అప్పట్లో దుకాణాల కేటాయింపునకు రూ.లక్షలు వసూలు చేసిన వైసీపీ నేత

ఎమ్మిగనూరు, మే 16 (ఆంధ్రజ్యోతి): కొత్త దుకాణాల నిర్మాణం పేరుతో చిరు వ్యాపారులను అప్పటికప్పుడు బలవంతంగా ఖాళీ చేయించారు. దాదాపు రెండేళ్లు గడుస్తున్నా వాటి నిర్మాణం ఊసేలేదు. అప్పటి వైసీపీ ప్రభుత్వంలో మున్సిపాలిటికి చెందిన ఓ ప్రజాప్రతినిధి అత్యుత్సాహం ప్రదర్శించి అధికారులపై ఒత్తిడితెచ్చి ఏళ్ల తరబడి వ్యాపారాలు చేసుకుంటున్న చిరువ్యాపారులను కొత్త దుకాణాల ఏర్పాటు పేరుతో ఖాళీ చేయించారు. ఏళ్లు గడుస్తున్న కొత్త దుకాణాలు నిర్మించకపోగా చిరువ్యాపారులను కూడా వ్యాపారాలు చేసుకోనివ్వటం లేదు. దీంతో చిరువ్యారులు దిక్కుకోకరు.. ముక్కుకోకరు అయ్యారు.

ఆగమేఘాలపై చిరు వ్యాపారుల ఖాళీ

పట్టణంలోని శ్రీనివాససర్కిల్ మార్కెట్ రోడ్డులో ప్రభుత్వ వైద్యశాల వద్ద కమిటీ రోడ్డును ఆనుకొని ఉన్న మున్సిపల్ స్థలంలో కొన్నేళ్లుగా కొంతమంది చిరు వ్యాపారులు వివిధ రకాల వ్యాపారాలను చేసుకుంటూ జీవనం సాగించేవారు. అయితే ఆ స్థలంలో పురపాలక సంఘం ఆధ్వర్యంలో కొత్తగా దుకాణాలను నిర్మించాలని మున్సిపల్ అధికారులు నిర్ణయించగా ఆఘమేఘాలపై రెండేళ్ల క్రితం చిరు వ్యాపారులను అక్కడి నుంచి మున్సిపల్ అధికారులు బలవంతంగా ఖాళీ చేయించారు. వ్యాపారులు వ్యతిరేకించడంతో మున్సిపల్ సిబ్బంది ఏకంగా చిన్నపాటి ఎక్స్‌వేటర్‌తో దుకాణాలను తొలగించేందుకు పూనుకున్నారు. దీంతో చేసేదిలేక చిరు వ్యాపారులు బతుకుజీవుడా అంటూ తమ వ్యాపారాలను మరొక చోటుకు తరలించుకోవాల్సి వచ్చింది. అయితే దాదాపు రెండేళ్లు గడుస్తున్నా ఇప్పటి వరకు దుకాణాల నిర్మాణాలకు మాత్రం మోక్షం రాలేదు.

రూ.లక్షల్లో దండుకున్నారు..

చిరు వ్యాపారులను ఖాళీచేయించిన స్థలంలో 22 దుకాణాలను నిర్మించేందుకు అధికారులు నిర్ణయించారు. అప్పట్లోమున్సిపాలిటీలో కీలకంగా వ్యవహరిస్తున్న ఓ దిగువ శ్రేణి ప్రజా ప్రతినిధి ఇదే అదునుగా భావించి తనదైన శైలిలో వ్యాపారుల నుంచి ముడుపులు దండుకున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అప్పట్లో ఆసక్తి ఉన్న వ్యాపారులను తన దగ్గరకు పిలిపించుకుని ఒక్కో దుకాణానికి రూ.5 లక్షల వరకు వసూలు చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. మున్సిపాలిటీకి చెందిన దిగువ శ్రేణి ప్రజా ప్రతినిధితో పాటు ప్రభుత్వ శాఖలో స్టేట్ డైరెక్టర్ పనిచేసిన వైసీపీ నాయకుడు కూడా వ్యాపారస్తులకు దుకాణాలు ఇప్పిస్తానని వారి నుంచి లక్షల రూపాయలు వసూలు చేసినట్లు ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. అంతేగాక అప్పట్లో మున్సిపల్ అధికారుపై కూడా ఆరోపణలు వినిపించాయి. అయితే రెండేళ్లు దాటినా మున్సిపల్ అధికారులు దుకాణాల నిర్మాణాలకు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



ఎమ్మిగనూరులో దుకాణాలు తొలగించిన స్థలం

ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం

శ్రీనివాస టాకీస్ సర్కిల్‌లోని ప్రభుత్వ ఆసుపత్రి పక్కన దుకాణాలు నిర్మించాలని గతంలో నిర్ణయించటం జరిగింది. అనుమతులకోసం అప్పట్లో ప్రభుత్వానికి ప్రతిపాధనలు పంపాము. ప్రభుత్వం అనుమతులు ఇవ్వాల్సి ఉంది.

-గంగిరెడ్డి, మున్సిపల్ కమిషనర్,
ఎమ్మిగనూరు మున్సిపాలిటీ

రోడ్డున పడ్డ చిరువ్యాపారులు

దుకాణాలు నిర్మిస్తామని ఆగమేఘాలపై చిరు వ్యాపారులను ఖాళీ చేయించిన అధికారులు రెండేళ్ళ దాటినా నిర్మాణాలు మాత్రం చేపట్టలేదు. ఎన్నో ఏళ్లుగా ఆ స్థలంలో చిరువ్యాపారాలు చేసుకుంటు జీవనం సాగిస్తున్న వారిని ఖాళీ చేయించటంతో వారు ఎక్కడ వ్యాపారాలు చేసుకోవాలో తెలియక నానా అవస్థలు పడుతున్నారు. కొంతమంది దుకాణాలు వదిలి ఇతర పనులకు వెల్లాల్సిన దుస్థితి ఏర్పడింది. ఇదిలా ఉండగా దుకాణాల కోసం చోటా నాయకులకు లక్షల్లో సొమ్ము ముట్టజెప్పుకున్న కొంతమంది వ్యాపారులు లబోదిబోమంటున్నారు. సదరు దిగువ శ్రేణి ప్రజా ప్రతినిధి చుట్టూ ప్రదక్షణలు చేస్తున్నా ఆ ప్రజా ప్రతినిధి ఉలుకూ..పలుకూ లేకపోవడంతో వ్యాపారులకు దిక్కుతోచని పరిస్థితి ఏర్పడింది. మరీ ముఖ్యంగా ఆ స్థలంలో దుకాణాలు నిర్మిస్తారా.. లేదా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

కూటమి ప్రభుత్వంలోనైనా

వైసీపీ ప్రభుత్వంలో ఖాళీచేయించిన స్థలంలో కూటమి ప్రభుత్వమైన దుకాణాలు నిర్మించాలని చిరువ్యాపారులు కోరుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చి దాదాపు 11 నెలలు గడుస్తున్న ఈ నిర్మాణాలపై ఎలాంటి చర్యలు లేకపోవటం వ్యాపారులు విమర్శలు వ్యక్తం చేస్తున్నారు. వైసీపీ ప్రభుత్వంలో ఖాళీ చేయించారు.. కనీసం కూటమి ప్రభుత్వంలోనైనా దుకాణాలు నిర్మిస్తారా.. లేదా అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కళాశాల భూముల కబ్జాకు యత్నం

● కళాశాల భూములు సాగుకు సిద్ధం చేస్తున్న వైనం
● భూముల్లో మొక్కలు, ముళ్లకంపలు, తొలగింపు
● పట్టించుకోని అధికారులు



బనవాసిలోని వెటర్నరీ కళాశాల

ఎమ్మిగనూరు, మే16(ఆంధ్రజ్యోతి): మండలపరిదిలోని బనవాసి ఫారంలో ఉన్న వెటర్నరీ కళాశాలకు కేటాయించిన భూమిలో కొంతమంది అనుమతి లేకుండా పంటలు సాగుచేసేందుకు భూమిని సిద్ధం చేస్తున్నారు. ఇందులో భాగంగా గత వారం రోజుల క్రితం రాత్రికి రాత్రే కళాశాల సమీపంలో ఉన్న గ్రామానికి చెందిన కొందరు కళాశాల భూమిలో ఉన్న మొక్కలను, ముళ్లకంపలను తొలగించారు. ఈ విషయం తెలుసుకున్న కళాశాల సిబ్బంది వారిని అడ్డుకునే ప్రయత్నం చేయగా మాకు గతంలో ప్రభుత్వం పట్టాలు ఇచ్చిందని చెప్పడంతో సిబ్బంది చేసేదిలేక విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. బనవాసి ఫారంలో పశుసంవర్ధక శాఖ ఆద్వరంలో ఉన్న భూముల్లో శ్రీ వెంకటేశ్వర వెటర్నరీ యునివర్శిటికి 2016లో దాదాపు 276 ఎకరాలు కేటాయిస్తు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అటు తరువాత ప్రభుత్వం వెటర్నరీ కళాశాల భవనాలను నిర్మించి 2020లో ప్రారంభించింది. అప్పటి నుంచి కళాశాల కొనసాగుతోంది. ఈ కళాశాల నుంచి వెనుక 10 సర్వే నంబర్లలో 200ఎకరాలు, కళాశాలకు ఎదురుగా పడమరవైపు 9 సర్వే నంబర్లలో 76.45ఎకరాలు ఉంది. అయితే సమీప గ్రామాలకు చెందిన కొంతమంది కళాశాలనుంచి కాని, ప్రభుత్వం నుంచి కాని ఎటువంటి అనుమతులు లేకుండా భూములను సాగుకు సిద్ధం చేసుకుంటున్నారు. ఇదేమని అడిగితే తమకు గతంలో ప్రభుత్వం ఇచ్చిందని చెప్పుకు రావటం గమనార్హం. వారం రోజులుగా రాత్రికి రాత్రే భూములను చదును చేస్తున్నా కళాశాల అధికారులుకానీ, యునివర్శిటీ అధికారులుకాని స్పందించిన దాఖలాలు లేవు. ఇది ఇలాగే కొనసాగితే కళాశాల పురోభివృద్ధికి అడ్డంకిగా మారే ప్రమాదం ఉంది. ఇప్పటికే బనవాసి ఫారంలో పశుసంవర్ధకశాఖ పరిధిలో ఉన్న భూములను వైసీపీ ప్రభుత్వ హాయంలో అప్పటి అధికార పార్టీనాయకుల అండదండలతో అక్రమసాగు చేసుకుంటూ వస్తున్నా అడిగే నాథుడే కరువయ్యారు. అడ్డుకోవాల్సిన ప్రభుత్వ యంత్రాంగం తూతూ మంత్ర ంగా చాటింపులు, ప్రకటనలు చేస్తు మిన్నుకుండి పోతున్నారు. దీంతో తాజాగా కళాశాల భూమిని సాగుచేసుకుందుకు ప్రయత్నాలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ విషయంపై కళాశాల ప్రిన్సిపల్‌ను వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఆయన అందుబాటులోకి రాలేదు.

సంక్షేమం చంద్రబాబుతోనే సాధ్యం



పూజ చేస్తున్న నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్ర రెడ్డి

మంత్రాలయం, మే 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బాలికల విద్య, సంక్షేమ పథకాలు అమలు చేయడం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతోనే సాధ్యం అవుతుందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జీ ఎన్ రాఘవేంద్రరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని చిలకలడోణ గ్రామంలో కస్తూర్బా గాంధీ జూనియర్ కళాశాలలో సర్వశిక్ష అభియాన్ నిధులతో ఆరు గదులు, రెండు మరుగుదొడ్ల నిర్మాణానికి ఎంఈఓ మైనుద్దీన్, ఎస్ఎస్ఏ ఏఈ రంగరాజు, కేజీబీవీ ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ రామకృష్ణ వేణి ఆధ్వర్యంలో భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా రాఘవేంద్రరెడ్డి మాట్లడుతూ కూటమి ప్రభుత్వం ఒకవైపు సంపద సృష్టిస్తూ, పరిశ్రమలు నెలకొల్పుతూ, సంక్షేమ పథకాలు అమలు చేస్తూ రాష్ట్రాన్ని అన్నివిధాలుగా అభివృద్ధి చేస్తుందన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ ఆర్ లక్ష్మయ్య, టీడీపీ నాయకులు ఎస్ఎం గోపాల్ రెడ్డి, పవన్‌కుమార్ రెడ్డి, గోపాల్, వీరేష్, మాలపల్లి లక్ష్మన్న, నరసన్న, హనుమంతు, శ్రీనివాసులు, ఈరన్న, రాఘవేంద్ర, భీమిరెడ్డి, విష్ణువర్దన్, ఉపాధ్యాయులు భ్రమరాంబ పాల్గొన్నారు.

రమణీయం.. ప్రహ్లాదరాయల వెండి రథోత్సవం



వెండి రథంపై ఊరేగుతున్న ప్రహ్లాదరాయలు

మంత్రాలయం, మే 16(ఆంధ్రజ్యోతి): మంత్రాలయంలో ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు వెండి రథంపై భక్తులకు దర్శనం ఇచ్చారు. శుక్రవారం వైశాఖ చవితి శభదినాన్ని పురస్కరించుకుని పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు పూర్ణబోధపూజ మందిరంలో ఉత్సవ మూర్తికి పాదపూజ చేసి పల్లకిలో ఊరేగించారు.

రాఘవరాయుడికి విశేష పంచామృతాభిషేకం

వేద పండితుల మంత్రోచ్చరణాలు, మంగళవాయిద్యాల మధ్య రాఘవ్రేంద స్వామి మూల బృందావనానికి బంగారు కవచ సమర్పణ సేవ వైభవంగా నిర్వహించారు. వైశాఖ శుక్రవారం చవితి శుభదినాన్ని పురస్కరించుకొని పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు ఆధ్వర్యంలో పండితులు బృందావనానికి సుప్రభాతం, నిర్మల విసర్జనం, క్షీరాభిషేకం, తులసీ అర్చన, విశేష పంచామృతాభిషేకం నిర్వహించారు.

రూ.5 లక్షలతో గోశాలకు ముఖ ద్వారం

శ్రీమఠం ఆధ్వర్యంలో కొనసాగుతున్న గోశాలకు రూ.5 లక్షలు ఖర్చుతో మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల ఆధ్వర్యంలో ముఖద్వార పనులు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. మఠం ఏఏవో మాధవశెట్టి, మఠం మేనేజర్లు వెంకటేష్‌జోషీ, సురేష్ కోనాపూర్, ఈఈ బద్రినాథ్, ఏఈ శ్రీహరి, గురుదాస్, గోశాల సూపర్ వైజర్ రాఘవేంద్ర దేశాయ్ పనులను చురుగ్గా పర్యవేక్షిస్తున్నారు. ఐదు నెలల నుంచి చేస్తున్న పనులు దాదాపు ముగింపు దశకు వచ్చాయి. పైభాగం అంతా ఓ వైపు రాఘవేంద్రస్వామి, మధ్య వైపు గోవుతో శ్రీకృష్ణుడు, మరో వైపు అభయాంజనేయస్వామి విగ్రహాలను సుందరంగా తీర్చిదిద్దారు. ఇది భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది. గోశాలను దర్శించుకునేందుకు ముఖద్వారం ఏర్పాటు చేయడంతో నూతన కళ ఏర్పడింది.

గాలివాన బీభత్సం

● ఉరుములు, మెరుములతో కూడిన వర్షం
● పట్టణంలోని సోమప్పనగర్‌లో కూలిన గోడ
● ఇద్దరు చిన్నారులు, ఓ వృద్ధుడికి గాయాలు



కూలిన గోడ

ఎమ్మిగనూరు , మే16(ఆంధ్రజ్యోతి): పట్టణంలో శుక్రవారం గాలివాన బీభత్సం సృష్టించింది. ఒక్కసారిగా గాలి, వానతో కూడిన వర్షం రావడంతో పట్టణంలోని పలు ప్రాంతాల్లో చెట్లు, మిద్దెలు నేల కొరిగాయి. పట్టణంలోని కోసిగి రోడ్డులో ఉన్న మాచాని సోమప్పనగర్ నిర్మాణంలో ఉన్న ఓఇల్లు పక్కలోనే ఉన్న గుడిసెపై పడడంతో వృద్ధుడు శ్రీరాములు, చిన్నారులు రుచిక, లక్కీకి తీవ్ర గాయాల య్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం హుటాహుటినా ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. పట్టణంలోని మిలటరీ కాలనీలో రెండు విద్యుత్ స్తంభాలతో పాటు, వీవర్స్‌కాలనీ, మైనార్టీ కాలనీ తదితర ప్రాంతాల్లో భారీ వృక్షాలు నేలకొరిగాయి. విద్యుత్ స్తంభాలు కూలిపోవడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దాంతో ఆయా ప్రాంతాలు అంధకారం నెలకొంది.

ఎమ్మిగనూరు రూరల్: మండలంలోని పరిధిలోని సిరాలదొడ్డి, రాళ్లదొడ్డి, కడిమెట్ల, కందనాతి, గుడికల్లు, కె. తిమ్మాపురం, కలుగొట్ల తదితర గ్రామాల్లో శుక్రవారం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడింది. రాత్రి 8గంటలకు ఒక్కసారిగా భారీ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు.



చికిత్స పొందుతున్న చిన్నారి



గాయపడిన వృద్ధుడు

నిండిన నీటి కుంటలు

ఎమ్మిగనూరు రూరల్, మే 16(ఆంధ్రజ్యోతి): మండలంలో రెండు రోజులుగా కురిసిన వర్షాలకు నీటికుంటల్లో వర్షపునీరు భారీగా చేరింది. మండలంలోని కందనాతి పంచాయతీలో దాదాపు 12 చెక్‌డ్యాంలతో పాటు నాలుగు నీటి కుంటలు దాదాపు 145 నీటికుంటలను అధికారులు ఏర్పాటు చేశారు. రైతులకు ఉపయోగపడే విధంగా కేంద్ర ప్రభుత్వం జాతీయ ఉపాధి హామీ పథకంలో ఉచితంగా ఈ పనులను చేయించింది. ఒకొక్క చెక్ డ్యాం కింద రైతులు దాదాపుగా 5 ఎకరాలకు పంటలను సాగుచేసుకోవచ్చు. నీటి కుంటల్లో నీరు నిల్వ ఉండడంతో భూగర్భజలాలు పెరుగుతాయని, పక్కనున్న బోరు బావుల్లో నీటి ఊట అధికమవుతుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



చెక్‌డ్యాంపై ప్రవహిస్తున్న వర్షపునీరు



కందనాతి గ్రామంలో వర్షపు నీటితో నిండిన చెక్‌డ్యాం

తవ్వారు.. వదిలేశారు..!

ఎమ్మిగనూరు టౌన్, మే 16 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని గాంధీనగర్ మెయిన్ రోడ్డు గుంతలమయంగా మారింది. ఏన్నో సంవత్సరాల కింద వేసిన రోడ్డు కావడంతో రోడ్డులో అడుగడుగునా గుంతలు పడ్డాయి. ఈ మధ్య గాంధీనగర్ రోడ్డు కూడా కమర్షియల్‌గా మారడంతో వాహనాల రాకపోకలు ఎక్కువయ్యాయి. ఆ రోడ్డులో మురుగు నీటి కాల్వ దగ్గర నెల క్రితం మున్సిపల్ అధికారులు గుంత తవ్వి వదిలేశారు. గుంతకు మరమ్మతులు చేయకుండా పూడ్చకుండా గుంతపైన పెద్ద పెద్ద బండలు పెట్టి నిర్లక్ష్యంగా వదిలేశారు. రాత్రి పూట కరెంట్ పోతే వాహనాదారులు ప్రమాదాలకు గురయ్యే ఆవకాశం లేక పోలేదు. అధికారులు స్పందించి బండలు తొలగించి, గుంతను పూడ్చి రోడ్డు వేయాల్సిందిగా కాలనీవాసులు కో రుతున్నారు.



గుంత తవ్వి బండలు వేసి వదిలేసిన మున్సిపల్ సిబ్బంది

నేల కొరిగిన విద్యుత్ స్తంభం

ఎమ్మిగనూరు టౌన్, మే 16 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని వైఎస్ఆర్ సర్కిల్‌లో ఈదురు గాలులకు విద్యుత్ స్తంభం నేలకొరిగింది. ఆ సమయంలో అక్కడ ఎవరు లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు. శుక్రవారం ఉదయం మునిపల్ సిబ్బంది స్తంభాన్ని తొలగించి వాహనదారులకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టారు. స్తంభాన్ని నేరుగా భూమిలో పాతడం వలన స్తంభం తుప్పు పట్టి పడిపోయిందని అక్కడి స్థానికులు అనుకుంటున్నారు.